


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 194 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 03 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

# వైఎస్సార్ ఆశయాలు.. పూర్తి చేసి తీరుతాం!

- సీఎం రేవంత్ రెడ్డి

- ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులకు సీఎం హామీ
- రైతుల కోసం వైఎస్సార్ చేసిన సేవలను గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి
- రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే
- తెలంగాణలో 3.40 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం : సీఎం

**నేటి శుభోదయ, న్యూఢిల్లీ :** దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కలలుగన్న ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు.డాక్టర్ వైఎస్సార్–డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అవార్డు–2026 ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు...

2







## 7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ ‘బంగారం కొనొద్దంటున్నారేంటి?

- బంగారం కొనొద్దని మోదీ మరోసారి పిలుపు
- విదేశాల్లో పెళ్లిళ్లకూ దూరంగా ఉండాలని విజ్ఞప్తి
- బంగారం దిగుమతులతో భారీగా విదేశీ మారకం ఖర్చు
- చమురు ధరల పెరుగుదలతో మరింత ఒత్తిడి
- జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు

2

## “ఎటు చూసినా విధ్వంసం, వికృతమే”..

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్



- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

2



## ముద్ర లోన్ అప్రూవ్డ్ మెసేజ్‌లా?

### జాగ్రత్త, ఇది కొత్త మోసం!

- ముద్ర లోన్ మంజూరైందంటూ వచ్చే వాట్సాప్ మెసేజ్‌లు నకిలీవి
- ఇవి మోసగాళ్లు పంపుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ
- ఆధార్, పాన్ వివరాలు ఎవరికీ పంపవద్దని ప్రజలకు సూచన
- అధికారికంగా బ్యాంకుల్లోనే ముద్ర లోన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచన
- ముద్ర సంస్థ నేరుగా ప్రజలకు రుణాలు ఇవ్వదని వెల్లడి

వివరాలు 2 లో..

## టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ : మంత్రి పొన్నం ప్రభాకర్



- 1000 రోజుల పాలనలో టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- సంస్థలోకి 2,932 కొత్త బస్సులు.. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట
- ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు

2

## నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!



- నేపాల్‌లో భారీ వర్షాలతో పలు నదులకు పోటెత్తిన వరదలు
- మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టం హెచ్చరిక స్థాయిని దాటిన వైనం
- మర్స్యంగ్డి నదిలో ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్న వరద
- నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటమే వరదలకు కారణం

2

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- ‘సీఎం.. సీఎం’ అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు
- ‘ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు’ అని వ్యాఖ్య

**నేటి శుభోదయ, మునుగోడు :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున ‘సీఎం.. సీఎం’ అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ‘నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు’ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి ‘రాజన్న రాజ్యం’ కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!



- ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ
- పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ
- అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి

వివరాలు 2 లో..

# ముద్ర లోన్ అప్రూవ్డ్ మెసేజ్‌లా?
# జాగ్రత్త, ఇది కొత్త మోసం!

**మొదటిపేజీ తరువాయి..**
ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) కింద రుణం మంజూరైందంటూ వాట్సాప్ వేదికగా సర్క్యులేట్ అవుతున్న నకిలీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. కొందరు దుండగులు ఇటువంటి సందేశాల ద్వారా ప్రజల నుంచి ఆధార్, పాన్ కార్డ్, బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. "మీ ముద్ర లోన్ దరఖాస్తు ఆమోదించబడింది" అంటూ వచ్చే సందేశాలు పూర్తిగా నకిలీవని, ప్రభుత్వం ఇటువంటి సమాచారాన్ని వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పంపించదని కేంద్రం స్పష్టం చేసింది. ముద్ర అనేది బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు పునఃరుణసహాయం (రీఫైనాన్స్) అందించే సంస్థ మాత్ర మేనని, వ్యక్తులకు లేదా వ్యాపారా సంస్థలకు నేరుగా రుణాలు మంజూరు చేయదని వివరించింది. ముద్ర రుణాల మంజూరు కోసం ఎటువంటి ఏజెంట్లు లేదా మధ్యవర్తులు లేరని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అర్హులైన వారు నేరుగా సమీపంలోని బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ), లేదా మైక్రో ఫైనాన్స్ సంస్థలను (ఎంఎఫ్ఐ) సంప్రదించి రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా, అధికారిక 'ఉద్య మమిత్ర' పోర్టల్ (udyamimitra.in) ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎటువంటి అనుమానాస్పద సందేశాలు వచ్చినా, వాటిని factcheck.pib.gov.in పోర్టల్‌కు పంపి వాస్తవాలను నిర్ధారించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు..
# మళ్లీ వరద ముప్పు!



**మొదటిపేజీ తరువాయి..** హిమాలయ దేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడ తెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో, అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల నాటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుం దెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది.

# నాపై కాదు.. ముందు
# రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

## ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!

**మొదటిపేజీ తరువాయి..** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం సరి కాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చ గొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పు కోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.

# వైఎస్సార్ ఆశయాలు.. పూర్తి చేసి తీరుతాం!
## - సీఎం రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..**

### రైతుల గుండెల్లో రారాజు

బతికున్నన్ని రోజులు రైతుల కోసం పరితపించిన వైఎస్సార్‌ను గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని సీఎం అన్నారు. 2003లో మండుటెండల్లో నిరుపేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వైఎస్సార్ చేపట్టిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అప్పట్లో రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తి వేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని అన్నారు.

### చివరి కోరికను నెరవేర్చాలి

డాక్టర్ వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు అందరూ కలి సికట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణలో సాగునీటి విస్తరణకు ఆయన ఆశయంగా నిలిచిన ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రైతులకు మరింత మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### పేదల ఆహార భద్రతకు పునాది

గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థ




(PDS)ను తీసుకొచ్చారని సీఎం తెలిపారు. బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర వస్తువులను పేదలకు అందించే ఈ విధానం దేశంలో ఆహార భద్రతకు పునాది వేసిందన్నారు. అదే విధంగా తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, ఇది ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారం భించిన పీడీఎస్ విధానం వల్లే సాధ్యమైందని రేవంత్ రెడ్డి వివరించారు.

### ప్రముఖుల హాజరు

కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేశ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ
# 'బంగారం కొనొద్దంటున్నారేంటి?

**మొదటిపేజీ తరువాయి..** దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధితో దూసుకెళుతోంది. అయినా ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు.. సరదా కోసం విదేశాలకు వెళ్లొద్దు.. విదేశాల్లో పెళ్లిళ్లు చేసు కోవద్దు అని సూచించారు. దేశం బలంగా ఉన్న సమయంలోనే ఇలాంటి జాగ్రత్తలు ఎందుకు చెబుతున్నారు? దీని వెనుక పెద్ద ఆర్థిక లెక్కే ఉంది. భారత్ తన బంగారం అవ సరాల్లో దాదాపు మొత్తం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంటే మనం బంగారం కొన్న ప్రతిసారీ దేశం నుంచి విదేశీ మారకం బయటకు వెళ్తుంది. దిగుమతులు పెరిగితే వాణిజ్య లోటు పెరిగే అవకాశం ఉంటుంది. డాలర్లకు డిమాండ్ పెరిగితే రూపాయిపై కూడా ఒత్తిడి పడుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో బంగారం దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 32 శాతానికి పైగా పెరిగాయి. జులైలో భారత్ వస్తువుల వాణిజ్య లోటు దాదాపు 32 బిలియన్ డాలర్లకు చేరింది. జనవరి తర్వాత ఇదే అత్యధిక స్థాయి. భారత్ తన ముడి చమురు అవ సరాల్లో 88 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధి వద్ద అంతరాయాల భయాలు చమురు మార్కెట్ల ను కలవరపెడుతున్నాయి. చమురు ధరలు పెరిగితే భారత్‌కు మరిన్ని డాలర్లు అవసరమ వుతాయి. అదే సమయం లో బంగారం దిగు మతులు కూడా పెరిగితే విదేశీ మారకం పై ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. అందుకే అవసరం లేని దిగుమతుల్ని తగ్గించాలన్నది మోదీ సూచనలోని ప్రధాన ఉద్దేశం. విదేశీ పర్యటన అంటే విమాన టికెట్లు, హోటళ్లు, ఆహారం, స్థానిక రవాణా వంటి వాటిపై విదేశాల్లో ఖర్చు చేయడం. ఇక డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే ఖర్చు మరింత భారీగా ఉంటుంది. అందుకే మోదీ అన్ని విదేశీ ప్రయాణాలను ఆపాలని చెప్పలేదు. అత్య వసరం కాని పర్యటనలు, విదేశీ పెళ్లిళ్లను మాత్రం మరోసారి ఆలోచించండి అన్నదే ఆయన సందేశం. ఆ డబ్బును దేశంలోనే ఖర్చు చేస్తే స్థానిక వ్యాపారాలు, సేవలకు ప్రయోజనం కలుగుతుందన్నది స్వదేశీ ఆలోచన. మేలో అమెరికా-ఇరాన్ ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనూ మోదీ ఇదే తరహా పిలుపునిచ్చారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని, అవసరం లేని విదేశీ ప్రయా ణాలను తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయడం, ప్రజా రవాణా ఉపయో గించడం, కార్‌పూలింగ్ చేయడం వంటి సూచనలు కూడా చేశారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇది అంచనాల కంటే మెరుగైన ఫలితమే. అయితే మార్చి త్రైమాసికంలోని 8.6 శాతంతో పోలిస్తే వృద్ధి తగ్గింది. ప్రపంచ యుద్ధాలు, చమురు ధరలు, ద్రవ్యోల్బణం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల వంటి ముప్పులు ఇంకా ఉన్నాయి. అందుకే ప్రస్తుతం ఉన్న ఆర్థిక బలాన్ని భవిష్యత్తు కోసం ఉపయోగిం చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ అనిశ్చితి కారణంగా బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. ఆగస్టులో అంతర్జాతీయంగా బంగారం ధర దాదాపు 10 శాతం పెరిగింది. ధర పెరిగిన సమయంలో భారతీయుల నుంచి డిమాండ్ కూడా బలంగా ఉంటే బంగారం దిగుమతి బిల్లు మరింత పెరు గుతుంది. అందుకే మోదీ పిలుపు వెనుక కేవలం 'బంగారం కొనొద్దు' అనే మాట మాత్రమే లేదు. విదేశీ మారకాన్ని కాపాడటం, రూపాయిపై ఒత్తిడి తగ్గించడం, ప్రపంచ ఆర్థిక షాక్‌ల ప్రభావాన్ని తగ్గించడం, దేశీయ వ్యాపారాలను బలోపేతం చేయడం వంటి నాలుగు కీలక లక్ష్యాలు ఉన్నాయి.

# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..
## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

**మొదటిపేజీ తరువాయి..** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరో పించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేని ఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివ ర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరో పించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్న పూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరో పించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలి పెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరో పించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలం గాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరో పించారు.

# టీజీఎస్‌ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ : మంత్రి పొన్నం ప్రభాకర్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్‌ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేప ట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలి పేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయా ణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివ రించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమా నులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించా మన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్‌ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైద రాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అమలు చేశామని, ప్రస్తుతం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, గతంలో సర్వీసు నుంచి తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరో 1500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రక టించారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, సీసీఎస్, పీఎఫ్ బకాయిలను గణనీయంగా తగ్గించామని మంత్రి వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ విలీన ప్రక్రియను యూనియన్ ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ అంటేనే దగా, మోసం

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- కేసీఆర్ రావడం పక్కా, రామరాజ్యం కావడం ఖాయం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రుకాల్చి వాత పెడతారు







**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసం అని తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఖమ్మం నగరంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు చేపట్టి, రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేస్తోందని, రైతు రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్ధితి ఆందోళనకరంగా మారిందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థులు కూడా అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారని అన్నారు.ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు అన్ని వర్గాలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించారని ఆరోపించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారిని మోసం చేస్తోందని అన్నారు. పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ తిరిగి రావడం పక్కా, రామరాజ్యం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు భూ కబ్జాలు, భూ దోపిడీలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. గతంలో ఖమ్మం జిల్లాలో ఒక్క మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ చేయలేని దుస్థితి నెలకొందని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను నష్టపరుస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణ, పూర్తి పనులపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జర్నలిస్టుల కోసం మంజూరు చేసిన 23 ఎకరాల భూమిని ఇప్పటికీ జర్నలిస్టులకు కేటాయించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. జర్నలిస్టుల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు..

# శ్రావణమాసం సందర్భంగా సదాశివపేటలో మహిళల ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :**
సదాశివపేట: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సదాశివపేట వీరశైవ లింగాయత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ బసవేశ్వర మందిరంలో ప్రతిరోజూ భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గందిగరాజు తెలిపారు.ఈ సందర్భంగా భజన కార్యక్రమం, లలితా సహస్రనామ పారాయణం, మహా మృత్యుంజయ జపం , పంచాక్షరి జపం హనుమాన్ చాలీసా తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని, శ్రావణమాసంలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని తీసుకురావడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



# ఖమ్మం ఖిల్లా లో వీధి కుక్కల విహారం

**ఖమ్మం, సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో గల ఖిలా ప్రాంతంలో వీధి కుక్కల స్వైర విహారం తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ , ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తమ దైనందిన కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలకు మాత్రమే కాకుండా పెద్దలకు, పాదాచారులకు మాత్రమే కాకుండా వాహనదారులకు కూడా ప్రాణ సంకటంగా వీధి కుక్కల బెడద భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఖమ్మం నగరం నడిబొడ్డున గల ఖిల్లా ప్రాంతంలో వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చింది. రహదారులపై గుంపులుగా చేరుతూ, తిరుగుతూకాలినడకన వెళ్లే వారిని, వాహనదారులను వెంటబడి వేధిస్తున్నాయి. కరవడానికి మీదకు వస్తున్నాయి. పిల్లలను బడికి పంపాలన్నా, రాత్రివేళ బయటికి వెళ్లాలన్నా జనం జంకే స్థితి నెలకొంది. కుక్కల బారి నుండి తప్పించుకునేందుకు పరుగులు తీస్తూ పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు, మరోవైపు క్రిందపడి గాయపడుతున్నారు. పగటిపూట ఈ విధంగా ఉంటే, రాత్రి పూట విపరీతమైన వీధి కుక్కల అరుపులు పిల్లల, పెద్దల నిద్రను భంగం చేస్తున్నాయి. అంతేకాకుండా ఈ వీధి కుక్కల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. వాటి కాట్లకు రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం కూడా ఉన్నది. ఇలాంటి వీధి కుక్కల బారి నుండి తమను కాపాడాలని, స్థానికులు పాలకులను, అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.



# ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్

**ఖమ్మం, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :**
ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మంలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయడానికి ప్రకటన జారీ చేసినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి సెప్టెంబర్ 3 నుంచి సెప్టెంబర్ 7 సాయంత్రం 4:00 గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు సెప్టెంబర్ 8న ఉదయం 10:00 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీఏఎస్ స్పెషలిస్ట్ తదితర పోస్టులతో పాటు అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, డివిఎల్., సైకియాట్రీ, పీడియాట్రిక్స్, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, రేడియో డయాగ్నోసిస్, ఫోరెన్సిక్ మెడిసిన్, అనస్థీషియా, జనరల్ మెడిసిన్ విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.పోస్టుల వారీగా విద్యార్హతలు, అనుభవం, నియమ నిబంధనలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాలు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://khammam.telangana.gov.in/ ప్రభుత్వ వైద్య కళాశాల వెబ్‌సైట్ https://gmckhammam.org/ నందు ప్రకటనలో పొందుపరిచినట్లు తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్లను సందర్శించి పూర్తి వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫిజికల్ ఎడ్యుకేషన్ వెంకన్నకు సన్మానం



**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
ఇటీవల జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుండి రాష్ట్ర స్థాయి ధ్యాన్ చంద్ ఎక్సిలెన్సీ అవార్డు ను అందుకున్న ఎస్ ఆర్ బి ఐజి ఎన్ ఆర్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ బట్టు వెంకన్నను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థలను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడాంశాల్లో నిష్ణాతులను చేస్తూ క్రీడాంశాల్లో తీర్చిదిద్దుతున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏ ఎల్ ఎన్ శాస్త్రి,డాక్టర్ శ్రీనివాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ రమాసత్యవతి, ఐ.క్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వీరన్న పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి కానుక



**కేశంపేట, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ**
కేశంపేట మండలం పాటిగడ్డ గ్రామంలో నిరుపేద కుటుంబానికి మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా ప్రారంభించారు. లబ్ధిదారు పాపకంటి శిరీష శేఖర్ కుటుంబం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారమైంది. నూతనంగా నిర్మించిన ఇంటిని ప్రారంభించిన అనంతరం నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, పాటిగడ్డ గ్రామ సర్పంచ్ అకిల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, నిర్దవెల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ తదీతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుమగల్ల రమేష్ మాట్లాడుతూ.. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి జీవితకాల కల అని, ఆ కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదని, పేద కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పించే సంక్షేమ పథకమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రావుల పెంటయ్య, ఫిషర్మెన్ కమిటీ సభ్యులు తుమ్మల గోపాల్, ధనరాజ్ రెడ్డి, అంజయ్య, ప్రకాష్, దర్శన్, అజర్, కాకూనూర్ నర్సింహాలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిది రేకులలో వైఎస్సార్‌కు ఘన నివాళి



**కేశంపేట, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముఖ్య కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా బీస కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమానికి అనేక కీలక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ముఖ్యంగా పేదలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సేవలు, ఆరోగ్యశ్రీ పథకం, రైతులకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని కొనియాడారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ బండల రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పొగుల భీమయ్య, చిట్టిరెడ్డి నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, పొగుల నర్సింలు, గుత్తి శేఖర్, లాలమోని చంద్రయ్య, నిరంజన్, కందన శివయ్య, నాగిళ్ల యాదయ్య, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి, శంభుల శేఖర్, పాండు, దాసరి నరసింహ, పబ్బతి మల్లయ్య, బత్తిన రాజు చందు, భీమయ్య, పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల విద్యాధికారి

- **సదాశివపేట్ మండల విద్యాధికారి శంకర్**






**సంగారెడ్డి, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** సదాశివపేట మండల విద్యాధికారి యన్ శంకర్ బుధవారం రోజు మండలంలోని నాగుల ప ల్లి, కొనాపూర్, అరూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయా పాఠశాలల్లో ఎఫ్ ఎల్ ఎన్ కి సంబంధించిన అంశాలు, రికార్డుల నిర్వహణ, అలాగే ఎఫ్ ఎల్ ఎన్ లో భాగంగా చేపట్టిన రెమిడియేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు.నాగులపల్లి పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కొనాపూర్, అరూర్ పాఠశాలల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల బోధనా తీరును ప్రశంసించారు.అరూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుడ్లు, రాగి జావా తప్పనిసరిగా అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎన్ శంకర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని, ఎఫ్ ఎల్ ఎన్ అమలులో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జయకృష్ణ, పద్మ, కృష్ణవేణి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్ ఎల్ ఎ ను కలిసిన రామడుగు సర్పంచ్



**నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** రామడుగు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సంతోష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం ఎమ్మెల్యే భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి గ్రామంలోని పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా గ్రామంలో అత్యవసరంగా నిర్మించాల్సిన మురుగునీటి డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాల గురించి ఎమ్మెల్యేకు వివరంగా నివేదించారు.గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి సానుకూలంగా స్పందించారు. వర్షాకాలం మరియు సాధారణ రోజుల్లో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వీలైనంత త్వరగా డ్రైనేజీలు మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు శాంక్షన్ చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రామడుగును అన్ని రంగాల్లో ముందుంచుతామని ఈ సందర్భంగా తెలిపారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల మాజీ అధ్యక్షుడు బాకారం రవి, ఉప సర్పంచ్ నవీన్, గ్రామ శాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యులు రాజేశ్వర్, గంగాధర్లతో పాటు పలువురు గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ 100 రోజుల హామీలు ఎక్కడ? 1000 రోజులు దాటినా ప్రజలకు సమాధానం లేదు

- **టిఆర్ఎస్ నాయకుడు చైతన్య కిరణ్**





**వికారాబాద్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** వికారాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో వంద రోజుల్లో ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకుడు చైతన్య కిరణ్ మల్కాపురం విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంలో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో చైతన్య కిరణ్ మల్కాపురం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మిన ప్రజలు ఆ పార్టీకి అధికారం అప్పగించారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెయ్యి రోజులు దాటుతున్నా ప్రజలకు పూర్తి స్థాయిలో సమాధానం చెప్పలేకపోతోందని, ఇక మాటలు కాకుండా హామీల అమలు కావాలని చైతన్య కిరణ్ మల్కాపురం అన్నారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ రాజీపడబోదని, కేటీఆర్ నాయకత్వంలో ప్రజల తరపున నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.

## మోడీ అధికంగా పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలని దిష్టిబొమ్మ దగ్ధం

- **మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య**




**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** మోడీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను అధికంగా పెంచి,సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపారని ఇది దుర్మార్గమైన చర్యకు నిదర్శనమని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య విమర్శించారు. బుధవారం ఖమ్మంలో బైపాస్ రోడ్ లో మోడీ ప్రభుత్వం పెంచిన అధిక ధరలను తగ్గించాలని నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసి,కేంద్ర ప్రభుత్వ మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సి వై పుల్లయ్య హాజరై మాట్లాడుతూ గోరుచుట్టుపై రోకటి పోటులా ఇప్పటికే ప్రజలు అనేక పెట్రోల్, డీజిల్,ఆరోగ్యానికి సంబంధించిన మందులు వైద్య ఖర్చులు, కరెంటు చార్జీలు, బట్టలు వంటి పెరిగిన చార్జీల భారాలతో ప్రజలుఇబ్బందులు పడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలను పెంచి సామాన్య మానవులు బ్రతకలేని పరిస్థితికి దిగజార్చాలని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పని చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి నెరవేర్చకుండా తిరిగి ప్రజల మీద భారాలు వేయటం అవకాశవాదం,ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు.ప్రధాని మోడీ ప్రభుత్వం అంబానీ, అదా ని లాంటి కార్పొరేటు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు కాపాడటం కోసం పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించుకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, టీ యు సి ఐ ఖమ్మం ఏరియా కమిటీ కార్యదర్శి కే శ్రీనివాస్, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ లక్ష్మి , పార్టీ నగర కార్యదర్శి పి శోభ, నగర నాయకులు జాలాది లెనిన్,డి చంద్, తిరపయ్య, దాసు నాగరాజు, సైదులు, రవి ఉపేందర్,పిడిఎస్యు నగర నాయకులు టీ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బట్టి మాటలన్నీ వట్టి మాటలే.. కాంగ్రెస్ హామీలు అమలేది? :డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్











**వికారాబాద్, 02 సెప్టెంబర్, నేటి శుభోదయ :** వికారాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వికారాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు.న్యూ గంజ్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, వెయ్యి రోజుల పాలనలో అనేక హామీలు నెరవేరలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా అని ప్రశ్నించారు."ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ చూసుకుంటది.. ఏడవ గ్యారంటీ నేనిస్తున్నా.. అదే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుడు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించేందుకు కూడా అనుమతులు ఇవ్వకపోతే ప్రజాస్వామ్యాన్ని ఎలా పరిరక్షిస్తారని మెతుకు ఆనంద్ ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి మాటలు ఊహల పల్లకిలో ఊరేగుతున్నాయని, బట్టి మాటలన్నీ వట్టి మాటలుగానే మిగిలాయని విమర్శించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు హామీల మోసం, నిరాశ, నిర్లక్ష్యం తప్ప మరేమీ దక్కలేదని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని నాయకులు తెలిపారు.

## నోటీసులు ఇచ్చినా ఆగని అక్రమ నిర్మాణం.. ఖానామెట్‌లో చర్యలు ఎప్పుడు?

**మాదాపూర్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్లు 11/28, 11/29లో తనకు చెందిన స్థలంలో తన అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ ఎ. సాయి కుమార్ యాదవ్ జిహెచ్ఎంసి చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తూ, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని కుమార్ బస్తీకి చెందిన సాయి కుమార్ యాదవ్, ఖానామెట్ గ్రామంలోని H.No. 2-56/27/5లో 233 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ స్థలం సర్వే నంబర్లు 11/28, 11/29లో ఉందని పేర్కొన్నారు.తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతి లేకుండానే కొందరు వ్యక్తులు సదరు స్థలంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని సాయి కుమార్ యాదవ్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి, అనధికార నిర్మాణం తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు



Date: 10-01-2026

To
The Deputy Commissioner
GHMC, Chanda Nagar Circle
Hyderabad, Telangana

Subject: Complaint regarding illegal construction at Survey No. 11/28 and 11/29

Respected Sir,

I, A. Sai Kumar Yadav, S/o A. Mallesh Yadav, residing at H.No: 1-88, Kumar Basthi, Madhapur, working as a Businessman, would like to bring to your notice that I have purchased a plot bearing H.No: 2-56/27/5, situated at Khanamet Village, with an extent of 233 square yards, in Survey No. 11/28 and 11/29.

However, some people are carrying out illegal construction on the said property without my knowledge or permission.

Therefore, I kindly request you to look into the matter and take necessary action against the unauthorized construction at the earliest.

Thanking you.

Yours sincerely,

A. Sai Kumar Yadav
Mobile: 9666694419

Office of the Deputy Commissioner
INWARD
No:
Date:
Madhapur Circle-20

తీసుకోవాలని ఆయన డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.ఇదిలా ఉండగా, అధికారుల నుంచి నోటీసులు జారీ అయినప్పటికీ నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణం కొనసాగితే భవిష్యత్తులో వివాదం మరింత ముదిరే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి, నిర్మాణ



పనులను వెంటనే నిలిపివేసి, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఈ మేరకు మార్చి 10, 2026న సాయి కుమార్ యాదవ్ ఫిర్యాదు సమర్పించగా, సంబంధిత డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఇన్‌వర్డ్ స్టాంప్ నమోదు అయినట్లు తెలిపారు. ఫిర్యాదుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## కేయూ భద్రత తెలంగాణ సంస్థలకే--ఆంధ్ర సంస్థలకు నో

- **వీసీ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నిరసన**

**వరంగల్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో భద్రతా సేవల నిర్వహణ బాధ్యతలను ఆంధ్ర ప్రాంత సంస్థలకు అప్పగించవద్దని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన భద్రతా సంస్థలకే అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం కేయూ ఉపకులపతి కార్యాలయంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేయూ భద్రతా సేవల బాధ్యతలను తెలంగాణ ప్రాంత సంస్థకే అప్పగించాలని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాల నిరసనపై ఉపకులపతి సానుకూలంగా స్పందించి, తెలంగాణ ప్రాంత సంస్థకే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేసినట్లు నాయకులు తెలిపారు.అయితే ఆంధ్ర ప్రాంత సంస్థకు కేయూ భద్రతా బాధ్యతలు అప్పగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. అవసరమైతే విశ్వవిద్యాలయ బంద్‌కు పిలుపునిస్తామని స్పష్టం



చేశారు.ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ (డీఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయి కుమార్ స్వేరో, నాయకులు ఉప్పుల శివ, చెట్టుపల్లి శివకుమార్, గుండా వంశీ, వివేక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు టీవీ ఫెడరేషన్ నూతన కమిటీకి ఘన సన్మానం

- **సినీ, టీవీ రంగ ఐక్యతతోనే కళాకారుల సంక్షేమం సాధ్యం: రాజశేఖర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** బంజారాహిల్స్ పరిధిలోని ప్రసాద్ ల్యాబ్స్ ప్రాంగణంలో తెలుగు టీవీ ఫెడరేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రాజశేఖర్ మాట్లాడుతూ.. సినిమా, టీవీ, డిజిటల్ రంగాల్లో పనిచేస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులు ఒకే కుటుంబంగా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సినీ రంగంలో ఐక్యత ఎంత బలంగా ఉంటే కళాకారులు, కార్మికుల హక్కులు, సంక్షేమం అంత సమర్థవంతంగా సాధించగలమని పేర్కొన్నారు.సినిమా నిర్మాణం నుంచి టెలివిజన్ కార్యక్రమాలు, ఓటీటీ, డిజిటల్ కంటెంట్ వరకు ప్రతి విభాగంలో వేలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు తమ ప్రతిభను అందిస్తున్నారని తెలిపారు. వీరి కృషి, శ్రమ వల్లే వినోద పరిశ్రమ ముందుకు సాగుతోందన్నారు. అందువల్ల పరిశ్రమలోని అన్ని విభాగాల సంఘాలు పరస్పర సహకారంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కళాకారులు, సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు, ఆరోగ్య భద్రత, బీమా, సంక్షేమ పథకాలు, ఆర్థిక భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కొత్తగా వస్తున్న ఓటీటీ, డిజిటల్ మీడియా అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా యువ కళాకారులు, సాంకేతిక నిపుణులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించాల్సిన అవసరం ఉందన్నారు.వ్యక్తిగత విభేదాలకు అతీతంగా పరిశ్రమ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే ఐక్యత అవసరమని, ఒకరి విజయాన్ని మరొకరు ప్రోత్సహిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి



అండగా నిలిచే వాతావరణాన్ని సినీ రంగంలో మరింత బలోపేతం చేయాలని రాజశేఖర్ ఆకాంక్షించారు.తెలంగాణలో సినిమా, టీవీ, డిజిటల్ రంగాలకు ఉన్న ప్రత్యేకతను కాపాడుతూ స్థానిక కళాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు అన్ని సంఘాలు, ఫెడరేషన్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నూతన కమిటీ కళాకారుల సంక్షేమంతో పాటు సినీ, టీవీ రంగాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసే వారధిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు రాజశేఖర్ ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ జనరల్ సెక్రటరీ నూకరాజు, ట్రెజరర్ ఎస్సారెస్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ రామ్మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆకెళ్ళ గోపాలకృష్ణ, కందుల శివ , యూనియన్ సభ్యులు విజయ్, జగదీష్, ఆఫీస్ మేనేజర్ మునిందర్ తదితరులు పాల్గొన్నారుకార్యక్రమంలో పలువురు కళాకారులు, సాంకేతిక నిపుణులు, సినీ, టీవీ రంగ ప్రతినిధులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు

## తెలుగు టీవీ ఫెడరేషన్ నూతన కమిటీకి ఘన సన్మానం

- **తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ రామ్మోహన్ ఆధ్వర్యంలో సత్కారం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** బంజారాహిల్స్ పరిధిలోని ప్రసాద్ ల్యాబ్స్ ప్రాంగ ణ ంలో తెలంగాణ టీవీ ఫెడరేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మ హోత ్సవ ం





ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ రామ్మోహన్ నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ భరత్ భూషణ్ హాజరయ్యారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రామ్మోహన్, టీవీ కళాకారులు, సాంకేతిక నిపుణుల సంక్షేమం కోసం ఫెడరేషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## మహానేతకు ఘన నివాళులు.

**ఏన్కూర్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి వేడుకలను ఏన్కూర్ మండల కేంద్రంలో ప్రధాన సెంటర్లో వైయస్సార్ విగ్రహానికి పూలమాల



వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... వైయస్సార్ అంటే అభివృద్ధికి చిరునామా అని, వైయస్ఆర్ అంటే సంక్షేమ పథకాలకు నిలువెత్తు నిదర్శనమని, ఆరోగ్యశ్రీ ,108 ,కళ్యాణ లక్ష్మి , ఫీజు రియంబర్స్మెంట్ వంటి పేదలకు అందించిన మహానుభావుడని పలువురు కొనియాడారు. చక్కని చిరునవ్వుతో చెరగని ముద్ర వేసుకున్న మహానుభావుడ ని, పలువురు కొనియాడారు. ఆయన చిరస్థాయిగా పేదల గుండెల్లో నిలిచి ఉంటారని, పేదలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ భరోసా ఇచ్చిన మహానేత ని, ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, మార్కెట్ కమిటీ సభ్యులు లచ్చి రామ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ లు కొప్పుల ప్రభావతి రెడ్డి, సామిల్ , భూక్య లాలు నాయక్,మేడ ధర్మారావు, ఓబీసీ మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు, పూర్ణ కంటి మైసరావు ,చందు లాల్, సీతారాములు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా యూపీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేయాలి...

- **వాయుపురి లో పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

**మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న సఫిల్‌గూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం వెనుక కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. పనుల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టడంతో పాటు వేగవంతంగా పూర్తి చేసి



ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సఫిల్‌గూడ పరిసర ప్రాంత ప్రజలకు స్థానికంగానే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, హేమంత్ పటేల్, గౌస్ ఇమ్రాన్, బంటి, మాశెట్టి అనిల్, నర్సింగ్‌రావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష



**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులకు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, ఖమ్మం నందు జడ్జి అరవ ప్రవీణ్ ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, అదేవిధంగా ఒక్కొక్కరికి రూ.5,000/- జరిమానా, మొత్తం రూ.15,000/- జరిమానా విధించారని ఇన్స్పెక్టర్ మోహన్ బాబు తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక్కొక్కరు అదనంగా 3 నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వివరించారు.

**- కేసు వివరాల ప్రకారం**
ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో క్రైం నెంబర్. 83/2018 యు/ఎస్ 365 ఐపిసి, సిసి నెంబర్. 285/2018గా నమోదైన కేసులో చక్కిలెల అలియాస్ నాగమళ్ల సతీష్ (ఏ 1), చక్కిలెల సంతోష్ (ఏ 2), చక్కిలెల సుమన్ (ఏ 3) నిందితులుగా ఉన్నారు. 2018 ఏప్రిల్ 20 న రాత్రి సమయంలో ఖమ్మం కిన్నెరసాని థియేటర్ ఎదురుగా ఉన్న కిరాణా జాగిరి మర్చంట్స్ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన వివాహ కార్యక్రమంలో కొత్త విశ్వనాథంతో గొడవపడి, అతనిని బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి, రహస్య ప్రదేశంలో అక్రమంగా నిర్బంధించినట్లు కేసు నమోదైందని తెలిపారు. ఈ మేరకు భార్య కొత్త గీత 2018 ఏప్రిల్ 21 న ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జ్షీట్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి ఇన్స్పెక్టర్ యు వెంకన్న బాబు, (ప్రస్తుతం డిఎస్పీ, ఇల్లందు) పనిచేశారు. ట్రీఫింగ్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ జె మోహన్ బాబు, ఏపిపి ఎస్ గాయత్రి సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ నిర్వహించగా, సిడిఓ వి రామకృష్ణ, కోర్టు లైజన్ అధికారులు కె శ్రీకాంత్, ఏస్ ఐ, కె శ్రీనివాస్, హెచ్ సి, డి నాగేశ్వరరావు, హెచ్ సి సహకరించారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## అలియాబాద్లో వైఎస్సార్కు ఘన నివాళి

- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్: కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో మజీద్పూర్ ప్రధాన రహదారి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్మెంట్, రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా సామాన్య ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. వైఎస్సార్ మరణించి ఏళ్లు గడుస్తున్నా ఆయన అందించిన సంక్షేమ పాలనను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజా సేవకు ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సామల జస్వంత్రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంప్రసాద్గౌడ్, అబ్బాగౌని భాస్కర్గౌడ్, ముద్దం ధర్మారెడ్డి, తంటం రాము, గిర్మాపూర్ నరసింగరావుగౌడ్, అబ్బాగౌని జగదీశ్వర్గౌడ్, అబ్బాగౌని వినోద్గౌడ్, కొమ్ము వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

- ఇంటింటికీ"బాకీ కార్డులు"హామీల అమలుపై ప్రజల్లో చైతన్యంలో :చిలువేరు పవన్



**ఖమ్మం, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ 19వ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు పవన్ ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాటకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్లో బుధవారం చిలువేరు పవన్ ఆధ్వర్యంలో "కాంగ్రెస్ బాకీ కార్డు"పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పడిందో వివరించే బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని పవన్ విమర్శించారు.

**బాకీ కార్డులో ప్రధాన అంశాలు**
మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందాల్సిన ప్రయోజనాలు, చేయూత పెన్షన్ల కింద వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన బకాయిలు, రైతు భరోసా–రుణమాఫీ, యువ వికాసం–గృహ నిర్మాణం, కొత్త రేషన్ కార్డులు తదితర అంశాలను బాకీ కార్డుల ద్వారా ప్రజలకు వివరించారు.అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని అమలు చేయాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పుల్ల రమేష్, జీకే సంపత్, కలివేలి శేషు, కిషోర్, సదానందం, కిరణ్ నాయక్, స్యాతం రంజిత్తో పాటు బీఆర్ఎస్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## లక్షల ప్రజాధనం ఖర్చు.. వాకింగ్ ట్రాక్కు దిక్కులేదు!

- లక్షలాది ప్రజాధనం ఖర్చు చేసినా.. నేడు ఆనవాళ్లు లేవు
- పట్టించుకోని అధికారులు, నాయకులపై కాలనీవాసుల ఆవేదన
- 31వ వార్డులో నిరుపయోగంగా మారిన వాకింగ్ ట్రాక్..
- గడ్డి, చెత్తతో పాముల సంచారం



**వికారాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :**
వికారాబాద్: ప్రజల ఆరోగ్యం, సౌకర్యం కోసం కేటాయించిన ప్రజాధనం సద్వినియోగం కాకపోతే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న 31వ వార్డు వాసుల నుంచి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం లక్షల రూపాయల నిధులు ఖర్చు చేసి పనులు చేపట్టినప్పటికీ, పూర్తి స్థాయిలో పనులు పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఆ వాకింగ్ ట్రాక్ ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది.వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రజాధనం వెచ్చించినా, పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్ మొత్తం గడ్డి, చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వాన్నంగా మారింది. పరిసరాలు పూర్తిగా పిచ్చిమొక్కలతో కప్పుకుపోవడంతో పాములు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు. దీంతో ప్రజలు అటువైపు వెళ్లేందుకు కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది.ప్రజల సొమ్ముతో నిర్మించిన వాకింగ్ ట్రాక్ను మధ్యలోనే వదిలేయడం ద్వారా ప్రజాధనానికి విలువ లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు. నిధులు మంజూరు చేసి ఖర్చు చేసినప్పటికీ పనులు ఎందుకు పూర్తి కాలేదు? ఇందుకు బాధ్యులు ఎవరు? నాయకులా.. అధికారులా.. గత పాలక వర్గమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా 31వ వార్డు వాకింగ్ ట్రాక్పై ప్రస్తుత పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్ను వినియోగంలోకి తీసుకువస్తే వార్డు ప్రజలు వ్యాయామం, వాకింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొంటున్నారు.ప్రజాధనంతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోకుండా వాటిని పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యానికి తెరదించి వాకింగ్ ట్రాక్ను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని 31వ వార్డు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## యూరియా, డీ ఏ పీ పంపిణీలో ఆన్ లైన్ విధానాన్ని రద్దు చేయాలి. - సిపిఎం డిమాండ్.

**ఏన్కూర్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :**
ఏన్కూరు మండలంలోని రైతులకు పంటలకు అవసరమైన యూరియా, డీఏపీ తదితర ఎరువులను సకాలంలో, సరిపడా అందించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువుల పంపిణీలో అమలవుతున్న ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.సీపీఎం ఏన్కూరు మండల కమిటీ సమావేశం బుధవారం బానోత్ బాలాజీ అధ్యక్షతన సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం మాట్లాడుతూ....రైతులు పత్తి, మిర్చి, వరి తదితర పంటలను సాగు చేస్తున్నప్పటికీ వాటికి అవసరమైన మేరకు యూరియా, డీఏపీ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఎరువుల కోసం రైతులు సొసైటీలు, పురుగుమందుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నప్పటికీ, వారికి అవసరమైన స్థాయిలో యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సకాలంలో సరిపడా ఎరువులను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు కూడా యూరియా అందించాలని కోరారు. ఎరువుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే రైతులను సమీకరించి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు."ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన ప్రభుత్వం ఎప్పటికీ ముందుకు సాగదు" అని భూక్య వీరభద్రం పేర్కొన్నారు. రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు రాగల తిరుమలరావు, ఏర్పుల రాములు, కాలసాని సాయి, ఇటికాల లెనిన్, బుచ్చాల వెంకటేశ్వర్లు, గంగరాజు, ఇంజం వేణు, అడపా శ్రీనివాసరావు, భూక్య లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.



# సర్వే నం.177లో ప్రభుత్వ భూమిని గుర్తించి కాపాడాలి

- **కురవి తహసీల్దార్‌కు ధైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న ఫిర్యాదు**




**మహబూబాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.177లో ఉన్న ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ ధైద భద్రయ్య, మల్లయ్య, ఇరుగు వెంకన్నలు కురవి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.సర్వే నం.177కు సంబంధించిన పాత, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో అధికారికంగా నిర్ధారించాలని వారు కోరారు. అలాగే ఈ సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని ఎవరెవరు ఆక్రమించుకున్నారో, ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉందో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.గడ్డవోని కుంట/పెద్ద చెరువు కట్ట, మత్తడి, తూము, అలుగు, మరియు కాలువల పరిధిలోని ప్రభుత్వ భూములను కూడా పరిశీలించాలని ఫిర్యాదుదారులు కోరారు. చెరువులు, ప్రభుత్వ భూముల హద్దులను సర్వే ద్వారా నిర్ధారించి శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ధైద భద్రయ్య (దళితరత్న అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు), కెన్నెర్ మల్లయ్య (సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత), ఇరుగు వెంకన్న (కురవి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు) తదితరులు ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ భూముల హద్దులు, ఆక్రమణల వివరాలు, తీసుకున్న చర్యలపై వ్రాతపూర్వక నివేదిక ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచుతున్నాం.




**ఏన్కూర్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాలలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు శాతం, క్రమశిక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, పాఠశాల–ఇంటి సమన్వయం తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు.విద్యార్థులలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు.విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ వారి అభ్యసనను పరిశీలిస్తూ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు, డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు దుస్తులను, బ్యాగ్స్, బెడ్ షీట్స్ లను ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చేతులపై అందజేయడం జరిగినది.సమావేశంలో తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, సూచనలను తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు తమ సహకారం అందిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.శోభన్, బి.రవి,బి.సక్రాం,బి.సింగ్య,జే. నాగేశ్వరరావు,ఎం.చంద్రావు, పాయం శ్రీనివాస్,డి. వెంకటరమణ, బి.శారదా భాయి,హర్యానాయక్,ఉషశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు మల్లేశ్వర రావు, గోపి, నాగమల్లేశ్వరి,మోహన్ రావు, ప్రసాద్,బసవయ్య,ఎస్.రమేష్, రాములు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

- **షేక్ అరుణ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** కురవి: తట్టుపల్లి గ్రామానికి చెందిన బేతమళ్ల జగదీష్‌పై కులం పేరుతో దూషించి, వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ అరుణ్‌తో పాటు ఘటనకు సహకరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సామేలు మాట్లాడుతూ.. తట్టుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళితుడు బేతమళ్ల జగదీష్ వెల్డింగ్ పని నిమిత్తం ప్రతిరోజూ కురవికి వచ్చి వెళ్తుంటాడని తెలిపారు. తోటి కార్మికుడైన షేక్ అరుణ్ ఇంటికి పిలిచి, ఎవరూ లేని సమయంలో జగదీష్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు ఆరోపించారు. కులం పేరుతో దూషించడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు ఆధునిక సమాజంలో హేయమైన చర్యలని అన్నారు. కుల బలం, కండబలం, డబ్బు బలంతో ఎవరినైనా బెదిరించడం లేదా దాడులకు పాల్పడటం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బాధితుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ వెంటనే స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. షేక్ అరుణ్‌తో పాటు ఘటనకు సహకరించిన వారిని వెంటనే అరెస్టు చేయకపోతే తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ, కురవి మండల కమిటీ, తట్టుపల్లి గ్రామ కమిటీతో పాటు ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సామేలు హెచ్చరించారు.

# వైఎస్సార్ సేవలకు నివాళిగా.. కార్మిక మహిళలకు చీరల పంపిణీ

**నేరెడ్ మెట్ , సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ మల్కాజిగిరి గాంధీ పార్క్‌లో ఆయన 17వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. అదే సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీడి శ్రీనివాస్ గౌడ్ మూడో వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ గౌడ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్‌జిత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ పరిశీలకుడు షమీర్ కౌశల్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ హాజరై మహిళలకు చీరలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం వంటి రంగాల్లో ఆయన తీసుకొచ్చిన పథకాలు సామాన్య ప్రజల జీవితాల్లో మార్పునకు దోహదపడ్డాయని గుర్తు చేశారు.వైఎస్సార్‌ను స్మరించుకోవడం కేవలం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేయడానికే పరిమితం కాకుండా.. ఆయన ఆశయాలైన పేదలకు అండగా నిలవడం, కార్మికులను గౌరవించడం, ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడం వంటి మానవీయ విలువలను ఆచరణలో కొనసాగించడమే నిజమైన నివాళి అని నాయకులు అన్నారు.అదేవిధంగా మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి జీడి శ్రీనివాస్ గౌడ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు, కార్మిక వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమకుమార్, బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్. ప్రసాద్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల



శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్, ప్రవీణ్, సత్యమూర్తి, పీట్ల నాగరాజ్, శ్రీకాంత్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మీ, బాబు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహేందర్ గౌడ్, గౌస్ భాయ్, కొండా గౌడ్, రవీందర్ రెడ్డి, నగేష్ గౌడ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, సంజయ్, ఆశ, శారద, భూదేవి, ఇంద్ర, అసిమ్, రాజు, చారి అగోండా, కుమార్ గౌడ్, పార్ధసారథి, రవీందర్, వినయ్ నిరుగొండ, రాజేష్ లింగం, రామచందర్, వెంకన్న, సిరిగిరి రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- **జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి**



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పాలన, ప్రజాసేవ చిరస్మరణీయమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో బుధవారం ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా భీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. వైఎస్సార్ మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆయన అందించిన ప్రజాసేవ, సంక్షేమ పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ టి. శంకర్‌గౌడ్, శ్రీ సీతారామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పి. లక్ష్మీనారాయణ, మాజీ ధర్మకర్తలు ఎ. భారతి, వి. మురళిగౌడ్, బి. కొండల్‌రెడ్డి, ఎన్. హరిగోపాల్, జి. హరికృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పి. ధర్మారెడ్డి, ఎస్. దుర్గయ్య, కె. రాము, ఆర్. శ్రీనివాస్‌యాదవ్, డి. కేశవులు, కాంగ్రెస్ నాయకులు ఎం. సాయికుమార్, కె. లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె. రమేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు ఎం. హరివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా తలకట్ల పెద్ద గంగారెడ్డి నియామకం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మరియు బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు శదినేష్ కులాచారి ఆదేశాల మేరకు, సిరికొండ మండలం పెద్ద వాల్గొట్ గ్రామానికి చెందిన తలకట్ల పెద్ద గంగారెడ్డి ని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమించారుఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు వెలుమా గంగారెడ్డి చేతుల మీదుగా తలకట్ల పెద్ద గంగారెడ్డి కి నియామక పత్రాన్ని అందజేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, రైతుల హక్కులు మరియు సంక్షేమం కోసం కిసాన్ మోర్చా తరఫున నిరంతరం కృషి చేస్తానని తలకట్ల పెద్ద గంగారెడ్డి గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరికొండ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు చౌటుపల్లి ప్రభాకర్ గారు, జిల్లా కార్యదర్శి అరికెల సాయి రెడ్డి గారు, వివిధ మండలాల కిసాన్ మోర్చా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

- **ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలో బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అలాగే మేరా/మేరు (MERA/MERU) కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని, కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు.అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

## బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు వద్దు

- **నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలి: సీపీ సుమతికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి**



**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయకుండా చూడాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఐపీఎస్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎలాంటి ఆధారాలు లేకుండా కేసులు నమోదు చేయకుండా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు. ఇప్పటికే నమోదైన కేసుల విషయంలోనూ వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, చట్టపరమైన నిబంధనల మేరకు మాత్రమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండేలా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించడం, రాజకీయాలకు అతీతంగా చట్టాన్ని అమలు చేయడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సీపీ సుమతి సానుకూలంగా స్పందిస్తూ.. విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, హేమంత్ పటేల్, గౌస్ ఇమ్రాన్, బంటి, మాశెట్టి అనిల్, నర్సింగ్‌రావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన బీసీ డెవలప్‌మెంట్ అధికారిణి జి.జ్యోతికి కలెక్టర్ దివాకర టిఎస్ అభినందనలు



**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ** ఖమ్మం జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన జి. జ్యోతి బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను కలెక్టర్‌కు అందజేశారు. పదోన్నతి పొందిన జ్యోతికి కలెక్టర్ దివాకర టిఎస్ అభినందనలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## మైనార్టీ మహిళలకు అండగా ప్రభుత్వం.. నియోజకవర్గంలో 95 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది.రాష్ట్ర మైనార్టీ శాఖమంత్రి అజారుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని,నియోజకవర్గానికి చెందిన మైనార్టీ సోదరీమణులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ పథకం కింద రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మొత్తం 95 చెక్కులు మంజూరయ్యాయి.లబ్ధిదారులైన ప్రతి మహిళకు ప్రభుత్వం రూ.50,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మైనార్టీ మహిళల ఆర్థిక సాధికారత,వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే,షాద్నగర్ ఎమ్మెల్యే,జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,మైనార్టీ మహిళా లబ్ధిదారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించటం హేమమైన చర్య

- **హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి : హెచ్ ఆర్ సి సి ఐ స్టేట్ ప్రధాన కార్యదర్శి బాబురావు**

**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ దేశాలు గర్వించదగినటువంటి మహోన్నత నేత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుడు యొక్క చరిత్రను వక్రీకరిస్తూ కల్పిత నాయకుడు అంటూ పుస్తకాన్ని రాసినటువంటి విధానం హేమమైన చర్య అనే తెలంగాణ రాష్ట్ర ఎస్ఆర్సిసిఐ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం బాబురావు బుధవారం తీవ్రంగా ఖండించారు. ప్రపంచ దేశాలు గర్వించదగినటువంటి మహోన్నత నేత దేశానికి లిఖితపూర్వకమైనటువంటి భారత రాజ్యాంగాన్ని అందించినటువంటి మహోన్నత మహానాయకుడు బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించే విధంగా వ్యవహరించినటువంటి హమారా ప్రసాద్ అనే వ్యక్తిపై తక్షణమే దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దేశంలో సామాన్యుడు దగ్గర నుంచి గొప్ప స్థాయి ఉన్నటువంటి ప్రజా ప్రతినిధుల వరకు నిరుపేద దగ్గర నుంచి కుబేరుల వరకు ఒకే ఓటును కలిగే విధంగా తన భారత రాజ్యాంగం ద్వారా హక్కును కల్పించిన మహోన్నత నేత అంబేద్కర్ మహనీయుడని ఈ సందర్భంగా వారు కొనియాడారు. అటువంటి మహోన్నతమైనటువంటి మహనీయులను అవమానిస్తూ వారి యొక్క చరిత్రను తప్పుదోవ పట్టించి సూర్యుడు మీద ఉమ్మేయాలనుకోవడం ఎంత సాధ్యమో అంబేద్కర్ను అవమానించడం కూడా అంతేనని చెప్పారు. భవిష్యత్తులో హమారా ప్రసాద్ తక్షణమే క్షమాపణ చెప్పాలని తన రాసినటువంటి బుక్కును వెనక్కు తీసుకోవాలని లేని ఎడల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే కేసులు నమోదు చేసి కఠినమైనటువంటి చట్టాలు ప్రయోగించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఒక సామాన్యుడు భారత రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తుంటే అంబేద్కర్ను గౌరవిస్తూ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నటువంటి ప్రజా ప్రతినిధులు అధికారులు ఈ దేశంలో భారత రాజ్యాంగం ద్వారా అనుభవిస్తున్నటువంటి మహోన్నతులు ఎందరో నోరు మెదపకపోవడం చాలా బాధాకరమని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడకుండా హమారా ప్రసాద్ పై రెండు తెలుగు రాష్ట్రాలలో పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి తక్షణమే ఆయనకు శిక్ష పడే విధంగా చట్ట ప్రకారం ముందుకు సాగాలని అంబేద్కర్ వాదులకు భారత రాజ్యాంగాన్ని గౌరవించే వారికి దేశ పౌరులకి బాబురావు విజ్ఞాపన చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగే విధంగా రాసిన పుస్తకానికి నిరసిస్తూ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సింగమాల వెంకట రమణయ్య, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్ ఆదేశాల ప్రకారం ఈ విధానాన్ని నిరసిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలియజేశారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

- **వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య**





**వికారాబాద్ 02 సెప్టెంబర్, నేటి శుభోదయ :** వికారాబాద్: పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు జాంబాపూర్ తండాలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు.వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో వికారాబాద్ నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీకి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, దీంతో అనేక నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు.జాంబాపూర్ తండాలో నూతన గృహాలను ప్రారంభించిన సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి గృహప్రవేశం చేయించారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, గడ్డం ప్రసాద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ గురిబాయి బాబునాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున గౌడ్, రాఘవేందర్, రామకృష్ణారెడ్డి, రాకేష్, నాయకులు శ్రీకాంత్, నాగరాజు, లాలయ్య, శేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు గాలికి.. ప్రజలకు 'బాకీ కార్డులు'!

- **కాంగ్రెస్ తీరుపై తూంకుంటలో బీఆర్ఎస్ సమరభేరి**
- **ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటూ రాజీవ్ రహదారిపై భారీ నిరసన**
- **అంబేడ్కర్ విగ్రహానికి 'కాంగ్రెస్ బాకీ కార్డు' సమర్పణ**




**శామీర్‌పేట, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఎన్నికల వేళ ప్రజలపై హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గద్దెనెక్కాక వాటి అమలును విస్మరించిందంటూ బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తూంకుంటలోని రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన, ఊరేగింపు నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ పార్టీ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డులు' ప్రదర్శించారు. మహిళలు, వృద్ధులు, పింఛన్‌దారులు, రైతులు, రైతు కూలీలు, కార్మికులు, దివ్యాంగులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇంకా అందాల్సిన ప్రయోజనాలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.'హామీలు ఇచ్చారు.. అమలు ఎక్కడ?', 'ప్రజలకు బాకీ పడిన హామీలు తీర్చాలి' అంటూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో రాజీవ్ రహదారిని హోరెత్తించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు అనేక సంక్షేమ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పింఛన్‌దారులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను 'బాకీలుగా' చూపిస్తూ రూపొందించిన కార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు.అనంతరం తూంకుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను సమర్పించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అనిత, మాజీ ఎంపీపీ ఎల్లుబాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# మల్లికార్జున నగర్ సభను విజయవంతం చేయాలి

**మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** నిషేధిత జాబితాలో ఉన్న నివాస స్థలాలు, ఎండోమెంట్ భూములు, పట్టణ భూ గరిష్ఠ పరిమితి (యూఎల్‌సీ) పరిధిలోని భూములు, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారి సమస్యల పరిష్కారానికి సంబంధించి గురువారం మల్లికార్జున నగర్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని గౌతమ్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ్‌యాదవ్ పిలుపునిచ్చారు.మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆయా భూములకు సంబంధించిన సమస్యలతో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నివాసితులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను వివరించాలని కోరారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఎండోమెంట్ భూములు, యూఎల్‌సీ పరిధిలోని స్థలాలు, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు మేకల సునీత రామ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయా సమస్యలకు చట్టపరమైన పరిష్కారం చూపించి, అర్హులైన నివాసితులకు న్యాయం జరిగేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. సమస్యలపై ప్రజలు నేరుగా తమ అభిప్రాయాలు, ఇబ్బందులను వివరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కావున ఆయా భూముల్లో నివాసముంటున్న ప్రజలు, సంబంధిత కుటుంబాలు గురువారం ఉదయం 11 గంటలకు మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేకల సునీత రామ్‌యాదవ్ కోరారు.



# అధికారి హోదాను పక్కనపెట్టి.. రోగికి వైద్యం



**మేడ్చల్ కలెక్టరేట్ , సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఏప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అ ందుతోంద నే భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.తనిఖీలకు పరిమితం కాకుండా అధికారి హోదాను పక్కనపెట్టి స్వయంగా వైద్యుడిగా ఓ రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రోగితో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకుని, అవసరమైన వైద్య సలహాలతో పాటు తగిన మందులను సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రోగుల రిజిస్టర్లు, వైద్య రికార్డులు, మందుల నిల్వలు, అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి రోజువారీ సేవలపై సమీక్షించారు. ప్రతి రోగికి సమయానికి, గౌరవంగా, నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు.

# 22ఏ, రీ సర్వేలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన

## : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీసర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో సర్వే కొనసాగుతుందని, పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, డిస్టిక్ కలెక్టర్ స్నేహ శబరిష్, బుధవారం జిల్లాలోని తొర్రూరు మండల కేంద్రంలో రీ సర్వేకు ఎంపికైన జమిస్తాన్పురం, కానాపురం, వెంకటాపురం, కర్కాల, గోపాలగిరి, మడిపల్లి ( 6) గ్రామాలలో ఈరోజు జమస్తాన్పూర్ లో జరుగుతున్న రీసర్వేలు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో (190) ఎకరాల పట్టా భూములను సర్వే చేయడం జరిగిందని, జులై 10 నుండి సర్వే కొనసాగుతుందని, లక్ష్యం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అనంతరం తొర్రూరు తహసిల్దార్ కార్యాలయంలో 22ఎ, పై నిషేధిత జాబితాలో వ్యవసాయతర భూముల ను సక్రమంగా గుర్తించాలని, భూ సమస్యలకు సంబంధించి రికార్డులలో ఎక్కడైనా వ్యవసాయ తర భూముల ప్రభుత్వ కార్యాలయాలు స్కూలు సబ్ స్టేషన్ తదితర అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ సూచించిన ప్రకారం 22 ఏ, ను పకడ్బందీగా అమలు చేయాలని



సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు, కార్యాలయ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందించాలని సూచించారు, ఈ పర్యటనలు కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వాల్గొట్‌లో ఎస్ఐఆర్-2 పరిశీలన.. 170 ఓట్లు పునరుద్ధరణ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఎంపీడీఓ రఫీ అహ్మద్ సూచించారు. చిన్న వాల్గొట్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్–2 కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్లకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో మొత్తం 226 నోటీసులు జారీ కాగా, తగిన ఆధార పత్రాలు సమర్పించిన 170 మంది ఓటర్ల ఓట్లను ఆన్‌లైన్‌లో పునరుద్దరించినట్లు ఎంపీడీఓ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు సంబంధించిన తగిన పత్రాలను సమర్పించి ఓటును ఆన్‌లైన్‌లో పునరుద్దరించుకోవచ్చని సూచించారు.ఓటు హక్కు ప్రతి అర్హుడైన పౌరుడికి ఎంతో విలువైనదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవసరమైన పత్రాలతో సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దడివే గణేష్, ఉపసర్పంచ్ గోవర్దన్, పంచాయతీ కార్యదర్శి శరణ్య, కారోబార్ సాయిరాం, జీపీఓ నవీన్, బీఎల్ఓ ఉమారాణి, ప్రవీన్, గంగాధర్ తో పాటు గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# 420 మీటర్ల ఫ్లెక్సీతో కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ నిరసన డిచ్‌పల్లిలో భారీ ర్యాలీ..

**నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** 420 మీటర్ల ఫ్లెక్సీతో కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ నిరసన డిచ్‌పల్లిలో భారీ ర్యాలీ లో పాల్గొన్న సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ డిచ్‌పల్లి మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, వాటి అమలు తీరును ప్రశ్నిస్తూ 420 మీటర్ల పొడవైన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి నాగపూర్ గేట్ వరకు ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నాయకులు ఆరోపించారు.ఈ నిరసన ర్యాలీలో సిరికొండ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నరవోయిన శ్రీనివాస్, నాయకులు భూషణ్ రెడ్డి, మోహన్ రెడ్డి, లింగంతో పాటు పలువురు యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్ర




మంలో నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ ఇన్చార్జి బాజిరెడ్డి జగన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

- **పెళ్లి విషయం దాచిపెట్టి సన్నిహితంగా మెలిగారంటూ మహిళ ఫిర్యాదు**



**నేరెడ్ మెట్,,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ నాయకుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే అనుచరుడిగా పేర్కొంటున్న జక్కుల కిరణ్‌కుమార్ ముదిరాజ్‌పై నేరేడ్‌మెట్ పోలీసులు అత్యాచారం, దాడి, బెదిరింపులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 751/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. కిరణ్‌కుమార్ తనకు వివాహమైన విషయాన్ని దాచిపెట్టి తనతో సన్నిహితంగా మెలిగినట్లు మహిళ ఫిర్యాదులో ఆరోపించారు. వ్యాపారంలో భాగస్వామ్యం కోసం తాను సుమారు రూ.30 లక్షలు సమకూర్చినట్లు పేర్కొన్నారు. అనంతరం తనపై, తన పదేళ్ల కుమారుడిపై దాడి చేశారని, కులం పేరుతో దూషించి అవమానించారని ఆరోపించారు.అంతేకాకుండా తన ఫొటోలను మార్ఫింగ్ చేసి పరువు తీసేందుకు ప్రయత్నించారని, హైదరాబాద్ విడిచి వెళ్లేందుకు రూ.3 లక్షలు ఇస్తామని, లేకుంటే హత్య చేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను హత్య చేసేందుకు రూ.10 లక్షలు ఖర్చు చేయడానికైనా సిద్ధమని బెదిరించినట్లు ఆమె ఆరోపించారు.మహిళ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్‌లోని సెక్షన్లు 69, 74, 79, 115(2), 351(2)తో పాటు ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టం–2015లోని సెక్షన్ 3(2)(v) కింద కేసు నమోదు చేసినట్లు నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపారు. ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విజయవంతంగా క్రీడా పోటీలు : ఎంఈఓ శైలజ లక్ష్మి







**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని పీఎస్ నయాబజార్‌లో ఉన్న భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (సిడబ్లూఎస్ఎన్) మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలలో పాల్గొన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రోత్సాహకంగా సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నయాబజార్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, పీఎస్ నయాబజార్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, ఖమ్మం అర్బన్ మండల విద్యాశాఖాధికారి శైలజా లక్ష్మి , ఐఆర్‌పీలు రాంసింగ్ నాయక్, ప్రజ్ఞ , స్పెషల్ ఎడ్యుకేటర్లు సరిత, సునీత, లావణ్య , సిడబ్లూఎస్ఎన్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో క్రీడా స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# 1000 రోజుల సంబరాలు జరపాలి : నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ ఒక ప్రక ట న లో మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలిస్తున్న మన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గురువారం అన్ని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ లు నిర్వహించి, గత 1000 రోజులలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అదేవిధంగా మీ మీ మండల, పట్టణ కేంద్రాలలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి ఈ వేడుకను ఘనంగా జరపాలని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను పత్రికా ముఖంగా కోరారు.

## పెండింగ్ రోడ్డు పనులకు నిధులు కేటాయించాలి

- **మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి వినతి**



**నేరెడ్ మెట్,సెప్టెంబర్ 2,నేటి శుభోదయ :**
పాత 137వ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, కాకతీయనగర్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులకు బడ్జెట్ కేటాయించి త్వరితగతిన పనులు చేపట్టాలని వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ప్రత్యేకంగా జేకే కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పనులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి విజ్ఞప్తిపై జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ సానుకూలంగా స్పందించారు. రోడ్డు పనులకు అవసరమైన బడ్జెట్ కేటాయింపుతో పాటు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఖాళీ పోస్టుల భర్తీ చేయడానికి దరఖాస్తుల ఆహ్వానం



**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
ఖమ్మం జిల్లా వైద్య, ఆ రోగ్య శాఖాధికారి కార్యాలయం పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) విభాగంలో, బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి. పోస్టుల వివరాలు: మెడికల్ ఆఫీసర్ (3 పోస్టులు – మల్టీ జోన్): ఎం బి బి ఎస్.,(ఎం బిబిఎస్) పూర్తి చేసి ఉండాలి. నర్సింగ్ ఆఫీసర్ (3 పోస్టులు – జోన్–IV): (B.Sc Nursing) బి ఎస్ సి నర్సింగ్., లేదా జి ఎన్ ఎం (GNM) పూర్తి చేసి ఉండాలని,.దరఖాస్తు విధానం: అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడంతో పాటు, పూర్తి వివరాలతో నింపిన ఆఫ్‌లైన్ అప్లికేషన్ ఫారమ్‌కు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జతపరచాలని,. పూర్తి చేసిన దరఖాస్తు పత్రాలను డి ఎం హెచ్ ఓ (DM&HO) ఆఫీస్, ఎఫ్ వన్ ( F1), ఐ.డి.ఓ.సి., వి.వెంకటాయపాలెం, ఖమ్మం, నందు స్వయంగా సమర్పించవలసి ఉంటుందని,ముఖ్యమైన తేదీలు: దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: 03.09.2026, ఉదయం 10:30 గంటల నుండి దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 10.09.2026, సాయంత్రం 05:00 గంటల వరకుపూర్తి వివరాలు, మార్గదర్శకాలు మరియు నోటిఫికేషన్ కొరకు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://khammam.telangana.gov.in/ ను సందర్శించగలరు.

# సర్పంచ్‌నే పక్కన పెట్టారా..? జిల్లా నేతల జోక్యం.. అధికారుల సహాయ నిరాకరణ.. కార్యదర్శి పాత్రపై ప్రశ్నలు!

- **ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌కు పనిచేసే స్వేచ్ఛ లేకపోతే.. పదవిలో ఎందుకు ఉండాలి?**
- **పిల్లిగుండ్ల తండా సర్పంచ్ బానోత్ రమేష్ సంచలన ఆరోపణలు**

**- అవసరమైతే రాజీనామాకు సిద్ధం**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
మహబూబాబాద్ కురవి: గ్రామ ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌గా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ గ్రామపంచాయతీ పరిపాలనను ముందుకు తీసుకెళ్లాల్సిన తనకు మూడు వైపుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పిల్లిగుండ్ల తండా సర్పంచ్ బానోత్ రమేష్ ఆరోపించారు.ఒకవైపు సొంత పార్టీకి చెందిన జిల్లా స్థాయి నాయకుడి జోక్యంతో స్థానిక నాయకుల మధ్య సమన్వయం దెబ్బ తింటోందని, మరోవైపు ఉపాధి హామీ విభాగానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ వాంకుడోత్ వీరన్న తదితరులు సర్పంచ్ అధికారిక హోదాను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తూ సహకారం నిలిపివేస్తున్నారని ఆయన ఆరోపించారు.మరోవైపు గ్రామపంచాయతీ పరిపాలనలో భాగస్వామ్యమైన సిబ్బందితో సమన్వయం చేసి పని చేయించాల్సిన పంచాయతీ కార్యదర్శి పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయని రమేష్ అన్నారు. సిబ్బంది వ్యవహారంపై కార్యదర్శి తగిన పర్యవేక్షణ చేస్తున్నారా, లేక వారి చర్యలకు వత్తాసు పలుకుతున్నారా, సర్పంచ్ అధికారిక ఆదేశాలను కూడా పక్కన పెడుతున్నారా అనే సందేహాలు తనకు కలుగుతున్నాయని తెలిపారు."ప్రజలు నాకు సర్పంచ్‌గా బాధ్యత అప్పగించారు. ఆ బాధ్యతను నిర్వర్తించే స్వేచ్ఛ కూడా లేకపోతే ప్రజలకు నేను ఏం సమాధానం చెప్పాలి? పదవి కోసం రాజీపడటం నా స్వభావం కాదు. ప్రజల కోసం పనిచేయలేని పరిస్థితి కొనసాగితే సర్పంచ్ పదవికి రాజీనామా చేయడానికైనా సిద్ధమే" అని బానోత్ రమేష్ స్పష్టం చేశారు.ఈ మూడు అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజా ప్రయోజనాల విషయంలో ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గకుండా తన బాధ్యతను నిబంధనల ప్రకారం కొనసాగిస్తానని తెలిపారు.

# నేడు గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ : డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

- **పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కొరకు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైట్ ను సందర్శించాలి**

**ఖమ్మం, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు రెండు నెలల కాలానికి (జాయిన్ అయిన తేదీ నుండి) తాత్కాలిక ప్రాతిపదికన అందించేందుకు నేడు (సెప్టెంబర్ 3న) ఉదయం 11 గంటలకు వాక్–ఇన్– ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ ఒకరిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ (ఓబి అండ్ జివై ) ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఈ నియామకాలు రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు. వాక్–ఇన్–ఇంటర్వ్యూ సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మం లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ ఎఫ్ –2లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధృవపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేడు నిర్ణీత సమయానికి నేరుగా వాక్–ఇన్– ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు https://khammam.telangana.gov.in ను సందర్శించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సింగాయిపల్లి పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

- **విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ.. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచన**



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**
శామీర్‌పేట్ మండలంలోని సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి ఆర్. కమలాకర్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, హాజరు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.విద్యార్థులతో ముచ్చటించిన ఎంఈఓ కమలాకర్.. ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచుకొని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం రెండో తరగతి గదిని సందర్శించిన ఆయన విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులను చదివిస్తూ వారి చదువు స్థాయిని తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను అర్థం చేసుకుని చదవడంతో పాటు, చదవడం–రాయడంలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిడి వెంకట్రామ్ రెడ్డి, ఉపాధ్యాయులు మురళీ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. వృద్ధాశ్రమంలో భోజన వితరణ

**శామీర్ పేట్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ తుర్కపల్లి నాయకులు సేవా కార్యక్రమం నిర్వహించారు. దశర్లపల్లి సమీపంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనం అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మేడ్చల్ నియోజకవర్గ యువ నాయకులు షేక్ ఇబ్రహీం, సుమంత్, అవినాష్, ఎం.డి. ఖాజా, బి. యాదగిరి, కుమార్, బరుంకుమార్ దాస్, పరశురామ్, జంగీర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ గరం గరం.. చలో ఆమనగల్‌కు కదిలిన వెల్జాల్ శ్రేణులు

- తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్
- బిఆర్ఎస్ యువ నాయకుడు వానరాశి వెంకటేష్



**తలకొండపల్లి, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు గురువారం ఆందోళన బాట పట్టాయి.బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యుడు గుర్క జైపాల్ యాదవ్ పిలుపు మేరకు తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామం నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ ఎత్తున చలో ఆమనగల్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.ఆమనగల్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన భారీ ధర్నా, కాంగ్రెస్ వైఫల్యాలపై బాకీ కార్డుల పంపకం,అలాగే 420 అడుగుల సుదీర్ఘ నిరసన ఫ్లెక్సీ ప్రదర్శనలో పాల్గొనేందుకు శ్రేణులు తరలివెళ్లాయి. వెల్జాల్ గ్రామం నుండి తరలివెళ్లిన వారిలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్,బీఆర్ఎస్ యువ నాయకుడు వానరాశి వెంకటేష్,జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజెబుర్ రహమాన్ తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నిరసన ద్వారా గళమెత్తనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శేఖర్ యాదవ్, శ్రీశైలం, సుభాన్,నాయకులు రమేష్ యాదవ్ రాజేందర్ రెడ్డి,అబిలాష్ గౌడ్, జగన్,గణేష్,ఇస్మిల్,వెంకటయ్య,గోదా జంగ్గయ్య యాదవ్, శంకర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవిత పైన ఫేస్‌బుక్ ఇంస్టాగ్రామ్ వేదికగా అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో టిఆర్ఎస్ పార్టీ నాయకుల ఫిర్యాదు



**మొయినాబాద్ సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదుగుతున్న తరుణంలో మంగళవారం సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కే అనిల్ పైన బుధవారం నాడు మోయినాబాద్ పోలీస్ స్టేషన్ లో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కుమ్మరి శివశంకర్ ప్రజాపతి టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి బేగరి రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా తన బాధను వ్యక్తపరచవచ్చు కానీ కానిస్టేబుల్ గా కే అనిల్ అనే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతున్నాడు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా రక్షక బటులు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షులు కవిత పైన ఇలాంటి వాక్యాలు పునర్వతమైతే సహించేది లేదని అన్నారు నిధుల నుండి వెంటనే సస్పెండ్ చేయాలని చట్టపరమైన కేసులు నమోదు చేయాలని టిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు యండి అన్వార్ ఖాన్, మొయినాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేకగూడెం బిక్షపతి,టిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ మహమ్మద్ నూర్ భాయ్,ఎనుగు సంజీవ రెడ్డి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి,చాకలి విక్రమ్,మాలని రాజు,యండి యూనిస్, సల్ల ఆంజనేయులు ముదిరాజ్, అబిలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి17వ వర్ధంతి వేడుకలు

- స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పోకల్ కార్ హరినారాయణ



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి17వ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం వైయస్సార్ పోకల్ కార్ హరినారాయణజి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చెరువుకట్ట పైన ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్రహీంప ట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ప్రజల కోసం ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక గొప్ప ముఖ్యమంత్రి స్వ ర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి అనిఅన్నారు ముఖ్యంగా పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ 108వైద్య సేవలురైతుల కోసం ఉచిత విద్యుత్ రుణమాఫీ విద్యార్థుల కోసంఫీజు రియంబర్స్మెంట్ మహిళా సంఘాలకు పావులా వడ్డీకి రుణాలు ఇంకా ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపేద వాడి గుండెల్లో గూడుకట్టుకున్న గొప్పముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గఅన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోఆనా డు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనే పేరు మార్చి అమలు చేస్తున్నారు తప్ప కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలు ఏమీ లేవు అని అన్నారు స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖ ర్ రెడ్డి పాలనలో ముఖ్యంగా పేద విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ పథకం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు మంజూరు అయ్యేవి నేటి ప్ర భుత్వాలు ఫీజు రియంబర్స్మెంట్ డ బ్బులు చెల్లింపు ప్రతి ఏడాది సక్రమంగా చెల్లించక పోవ డంతో ప్రవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజు డబ్బులు కట్టాలని విద్యార్థులను నానా ఇబ్బం దులకు గురి చేస్తూ పేద విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు అన్నారు ఈనాడు ప్రతిపేద విద్యార్థి ఆనాడు వైయస్సార్ పాలన గురించి గుర్తు చేసుకుంటున్నారు అని అన్నారు ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రవేట్ కాలేజీలలో చదువుకునే పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా పెండింగ్ లో ఉన్న ఫీజు రియం బర్స్మెంట్ డబ్బులు వెంటనే కాలేజ్ యజమాన్యాలకు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యాచారం మండలం వైయస్సార్ పంది జయరాజ్ జోగు శ్రీకాంత్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ అష్రఫ్ మురళి తదితరు లు పాల్గొన్నారు.

# దేశ సమగ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలి. :విశ్వ హిందూ పరిషత్



**ఏన్కూరు, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** దేశం లోని ప్రజలు అ ంద రూ సమైక్యంగా ఉండి మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ మన దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలనివిశ్వహిందూ పరిషత్తు మఠ మందిర్రుబంధక్ జాతీయ అధ్యక్షులు మూసాపేట రామరాజు ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మాల సత్యం అన్నారు..సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించే కార్యక్రమం లో బాగంగా బుధవారం మండల పరిధిలోని నాచారం యోగాశ్రమంలో గాయత్రి హోమాన్ని నిర్వహించి సంస్కృతి దీక్ష యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ......మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను రూపుమాపడానికి దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు దేశంలోకి కొన్ని విదేశీ శక్తులు చొరబడి కుయుక్తులు పన్నుతున్నారని అలాంటి శక్తుల వలలో పడి మన దేశాన్ని ధర్మాన్ని సంస్కృతి సాంప్రదాయాలను అగౌరవపరచ వద్దని విదేశీ పాశ్చాత్య సంస్కృతి సాంప్రదాయాలకు అలవాటు పడకూడదని ఆయన తెలిపారు..ప్రతీ మనిషి లో చెట్టులో పుట్టలో దేవుడు ఉన్నాడని చెప్పే ధర్మం హిందూ ధర్మమని హిందూ ధర్మం మనుగడ సాగిస్తేనే మానవాళి మనుగడ ఉంటుందని అదే విశ్వహిందూ పరిషత్ చెపుతుందని వారు తెలిపారు.మన సంస్కృతి నీ కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ దీక్ష చేపట్టి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని వారు కోరారు..ఈ కార్యక్రమంలో భాగ్యనగరం భాగ్యలక్ష్మి దేవాలయం అధ్యక్షురాలు శశికళ జిల్లా అధ్యక్షుడు బోనాల రామక్రిష్ణ యోగాశ్రమం నిర్వాహకులు మల్లేశం గురూజీ ,విశ్వహిందూ పరిషత్తు పెద్దలు చనుమోలు వెంకటేశ్వరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం జన్మదిన వేడుకలు



**వికారాబాద్ 02 సెప్టెంబర్, నేటి శుభోదయ :** మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్, చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం జన్మదిన వేడుకలు బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నవాబ్పేట్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రకాంత్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని కె.ఎస్. రత్నంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ మండల పరిషత్ 2వ సర్వసభ్య సమావేశం। ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో రెండవ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాలు,ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు.అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభు సాగర్,డీ ఎల్పీవో ఎంపీవో రమేష్ తో పాటు వివిధ శాఖల అధికారులు,స్థానిక సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వేములనర్వలో ఘనంగా బోనాల ఊరేగింపు

- **మదర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల సందడి**



**కేశంపేట, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** శంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా మదర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరగనున్న బోనాల పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ఊరేగింపులో పాల్గొని ఆకట్టుకున్నారు.వేములనర్వ చౌరస్తాలో విద్యార్థుల బోనాలు, పోతురాజుల విన్యాసాలు, నృత్యాలతో సందడి నెలకొంది. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, ఆఫ్రిన్, రాఘవేందర్, కవిత తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# సుజ్ఞానపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్...

- **అక్రమ గుడుంబా కేంద్రాల ధ్వంసం.. పత్రాలు లేని వాహనాలు స్వాధీనం...**





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 02, నేటి శుభోదయ :** దుమ్ముగూడెం మండలం సుజ్ఞానపురం గ్రామంలో పోలీసులు బుధవారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో దుమ్ముగూడెం, చర్ల పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు.గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, గుర్తించిన అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలకు తరలించారు.ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్‌కుమార్ గ్రామస్థులతో మాట్లాడి ఎన్‌డీపీఎస్ నేరాలు, అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలు, సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే యువతకు పోలీస్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియామక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ, చర్ల ఎస్‌హెచ్‌ఓ వెంకటప్పయ్య, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ, శ్యాంప్రసాద్, జగన్మోహన్‌చారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

- **ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమంటీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ బి. రవి ప్రకాశ్ పిలుపు**




**శామీర్ పేట,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల చిరకాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా చైర్మన్ బి. రవి ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కులు, ఆర్థిక భద్రత, సంక్షేమం కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, కార్మికుడు, పెన్షనర్ మద్దతుగా నిలవాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీజీఈజేఏసీ డిమాండ్ చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చేపడుతున్న ఐక్య ఉద్యమాన్ని అవసరమైతే మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని రవి ప్రకాశ్ స్పష్టం చేశారు.'చలో హైదరాబాద్' సన్నాహక సమావేశం'చలో హైదరాబాద్' కార్యక్రమ విజయవంతానికి సంబంధించి బుధవారం నాంపల్లిలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు.ఈ సందర్భంగా బి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'చలో హైదరాబాద్' కేవలం ఒక కార్యక్రమం కాదని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లే ఐక్య ఉద్యమమని పేర్కొన్నారు.సెప్టెంబర్ 10న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి. రవి ప్రకాశ్ కోరారు.

# నర్కూడ గ్రామ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు మహేష్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** నర్కూడ గ్రామ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు మహేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్,కాబోయే ఎమ్మెల్యే పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డి.సి.సి.బి డైరెక్టర్,మాజీ జడ్పిటిసి బుర్కుంట సతీష్ శాలువాతో సన్మానించి,కేక్ కట్ చేయించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ జన్మదినంతో మీ రాజకీయ ప్రస్థానం మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని,రాజకీయంగా మంచి గుర్తింపు,ఉన్నత పదవులు లభించాలని,అలాగే మీ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి,విజయాలు సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాము.మీరు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండి నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆశీర్వదిస్తున్నామన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు' ఒక నమ్మకం, ఒక భరోసా: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- **చంద్రధన లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం**
- **సర్పంచ్ సొల్లు రంగమ్మ**





**త ల కొండ ప ల్లి, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రార ంభోత ్సవ కార ్యక్రమ ం బుధవారం సర్పంచ్ సొల్లు రంగమ్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయ ణ రెడ్డి లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అని కొనియాడారు. ఇల్లు లేని ప్రతి పేదవాడు కేవలం తలదాచుకునే చోటు మాత్రమే కాకుండా, సమాజంలో తలెత్తుకుని బతికేలా చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు.ఏళ్ల తరబడి సొంతింటి కలతో ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఒక పథకంలా కాకుండా..ఒక భరోసా,నమ్మకం,విశ్వాసంగా నిలుస్తుందని స్పష్టం చేశారు.వానొచ్చినా, ఎండొచ్చినా 'మనకంటూ ఒక ఇల్లు ఉంది' అనే ధైర్యాన్ని ఈ ఇళ్లు కల్పిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఇది తల్లిదండ్రుల కష్టానికి ఓ చిరునామా అని, పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని భావోద్వేగంగా మాట్లాడారు. తాము కేవలం ఇళ్లు కట్టడం లేదని, ఒక కుటుంబం కలను నిజం చేస్తున్నామనే తృప్తి ప్రజా ప్రభుత్వానికి ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే..అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీతా రావమ్మ, అధికారులు, ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి డి.రఘురాములు, డిసిసి కార్యదర్శి భగవాన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, అజీమ్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ పి.రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి, శ్రీశైలం, గ్రామ వార్డు సభ్యులు, నాయకులు మాజీ ఎంపీటీసీ రాములు,రాజేందర్ రెడ్డి,చిత్తరంజన్,రాఘవేందర్, బండల శంకర్ రెడ్డి, శివాజీ, వార్డ్ నెంబర్ కిట్టు,అయ్యన్న,మహేష్, ఆదర్శ్, బి. యాదగిరి, సిమ్మారెడ్డి, కృష్ణయ్య, సాకలి యాదగిరి, షర్ఫ్, దాసరి యాదయ్య,సాకలి అంజయ్య, జంగయ్య, మండల నాయకులు అంజయ్య గౌడ్, పి.అశోక్ బాబు, బి.నర్సింలు, అజీజ్, జుట్టు తిరుపతయ్య ముదిరాజ్, అరిఫ్, రాజేందర్ నాయక్, విష్ణు, పవన్ వాల్మీకి, ఆంజనేయులు, శ్రీను తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో రూ.4.11 కోట్ల గృహ రుణాల మోసం!

- రిజిస్ట్రేషన్లకు సహకరించిన మాజీ సబ్‌రిజిస్ట్రార్ అరెస్ట్
- ఏడు కేసుల్లోనూ పాత్ర.. 11 రుణ లావాదేవీలపై పోలీసుల దర్యాప్తు
- మరింత మంది అరెస్టుకు రంగం సిద్ధం: డీసీపీ శ్రీధర్



**మల్కాజిగిరి కమిషనరేట్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించి.. వాటి ఆధారంగా బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రూ.4.11 కోట్ల గృహ రుణాలు పొందిన మోసపూరిత వ్యవహారంలో అప్పటి కీసర సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్ అరెస్టయ్యారు. నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించారనే ఆరోపణలపై ఆయనను ఏడు కేసుల్లో నిందితుడిగా గుర్తించిన పోలీసులు.. న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసులో మరింత మంది నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని మల్కాజిగిరి జోన్ డీసీపీ సీహెచ్ శ్రీధర్ తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారే లక్ష్యంగా..కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పలు స్థిరాస్తి మోసం, నకిలీ పత్రాలు, మోసపూరిత రిజిస్ట్రేషన్ కేసుల దర్యాప్తులో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రియల్ ఎస్టేట్ మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు, జీపీఏ హోల్డర్లు, నకిలీ విక్రేతలు, ఇంపర్సనేటర్లు, రుణగ్రహీతలు కలిసి మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను గుర్తించి.. వారి పేర్లను ఉపయోగించి నకిలీ స్థిరాస్తి పత్రాలు సృష్టించి రుణాలు పొందినట్లు దర్యాప్తులో తేలింది.ముందుగా ఈఎంఐలు.. ఆపై ఎగవేతనకిలీ పత్రాల ఆధారంగా బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొందిన అనంతరం కొంతకాలం క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించేవారు. బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించిన అనంతరం ఉద్దేశపూర్వకంగా రుణ వాయిదాలు నిలిపివేసినట్లు పోలీసులు గుర్తించారు. డిఫాల్ట్ నోటీసులు జారీ అయిన తర్వాత ఆస్తులను పరిశీలించగా.. కొన్ని ఆస్తులు వాస్తవంగా లేనట్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, ఇతర ఆస్తి వివరాలు తారుమారు చేసినట్లు బయటపడింది.ఇప్పటివరకు 11 మోసపూరిత గృహ రుణ లావాదేవీల్లో రూ.4.11 కోట్ల మేర మోసం జరిగినట్లు గుర్తించామని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు.సబ్‌రిజిస్ట్రార్ పాత్రపై ఆధారాలుకీసర సబ్‌రిజిస్ట్రార్‌గా యూసుఫ్ ఉర్ రహ్మాన్ పనిచేసిన సమయంలో పలు అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలకు సంబంధించిన పత్రాలు రిజిస్ట్రేషన్ అయినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా క్రైం నంబర్ 928/2025 దర్యాప్తులో 2021, 2022 సంవత్సరాల్లో కీసర ఎస్‌ఆర్‌ఓలో నమోదైన పలు సేల్ డీడ్లను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనంతరం ఈ పత్రాలను నిందితులు బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల వద్ద టైటిల్, సెక్యూరిటీ పత్రాలుగా సమర్పించి రుణాలు పొందినట్లు తేలింది.రిజిస్ట్రేషన్ రికార్డులు, సేల్ డీడ్లు, జీపీఏ/ఏజీపీఏ పత్రాలు, థంబ్ ఇంప్రెషన్, బయోమెట్రిక్ రికార్డులు, ఫొటోలు, సాక్షుల వాంగ్మూలాలు తదితరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఏడు కేసుల్లో కీలక పాత్రమాజీ సబ్‌రిజిస్ట్రార్ పాత్ర క్రైం నంబర్లు 723/2021, 714/2025, 419/2025, 241/2025, 195/2023, 84/2026, 928/2025 కేసుల్లో వెలుగులోకి వచ్చినట్లు డీసీపీ తెలిపారు. నకిలీ, కల్పిత స్థిరాస్తి పత్రాలు, తప్పుడు లింక్ డాక్యుమెంట్లు, ఇంపర్సనేషన్, జీపీఏ/ఏజీపీఏ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసి.. వాటిని తదుపరి ఆస్తి లావాదేవీలు, రుణాల కోసం వినియోగించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు చెప్పారు.ఇంట్లో కీలక పత్రాల స్వాధీనంసెప్టెంబర్ 1న సాయంత్రం 6 గంటలకు యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. ఆయన వెల్లడించిన సమాచారంతో నివాసం నుంచి కేసులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాల ప్రతులు, ఇతర కీలక డాక్యుమెంటరీ ఆధారాలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల లోన్ ఫైళ్లు, టైటిల్ వెరిఫికేషన్ నివేదికలు, మార్ట్‌గేజ్ పత్రాలు, కేవైసీ వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నారు. నిందితుల మధ్య జరిగిన కమ్యూనికేషన్లు, ఆర్థిక లావాదేవీలను నిర్ధారించేందుకు డిజిటల్, ఎలక్ట్రానిక్ ఆధారాలను సైతం సేకరిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు.. మోసం ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులను గుర్తించి మొత్తం నేర నెట్‌వర్క్‌ను వెలుగులోకి తీసుకొచ్చేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డీసీపీ శ్రీధర్ తెలిపారు.ఆస్తి పత్రాలను పరిశీలించాలిస్థిరాస్తి కొనుగోలు, రిజిస్ట్రేషన్, గృహ రుణాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. ఆస్తి టైటిల్, లింక్ డాక్యుమెంట్లు, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, ఇతర వివరాలను సంబంధిత రెవెన్యూ రికార్డులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, బ్యాంకులు లేదా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. తెలియని వ్యక్తుల మాటలు నమ్మి తమ పేర్లపై రుణాలు తీసుకోవద్దని.. నకిలీ పత్రాలు, అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్-100కు తెలియజేయాలని కోరారు.డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్‌ఐ ఎస్. అనిల్‌కుమార్, సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు..

# సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**శామీర్ పేట , సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :** సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీనోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య గౌడ్ సూచించారు. జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్ శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ గోపగాని గురువయ్య గౌడ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతోందని, ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆన్‌లైన్ వేదికలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులకు స్పందించవద్దని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని చెప్పారు.ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన బహుమతులు, ఉద్యోగ అవకాశాలు, రుణాలు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ మోసానికి గురైనట్లు అనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రహదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ గోపగాని గురువయ్య గౌడ్ కోరారు. సురక్షితమైన ఆన్‌లైన్ విధానాలను పాటించడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# 000 పైగా పది పైసల నాణాలతో వైఎస్సార్ అద్భుత చిత్రం

- ప్రముఖ కళాకారుడు రామకోటి రామరాజు ఘన నివాళి

**గజ్వేల్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** 1988 నాటి చిన్న పది పైసల నాణాలను 1000కి పైగా ఉపయోగించి, బుధవారం నాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ చిత్రాన్ని వినూత్నంగా రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. రంగులు, పెయింట్లకు భిన్నంగా నాణాలతో వైఎస్సార్ చిత్రాన్ని ఆవిష్కరించడం ఆయన సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచింది. “వైఎస్సార్ ప్రజా సంక్షేమానికి ప్రత్యేక ముద్ర వేసిన నాయకుడు. అలాంటి మహానేత జ్ఞాపకాన్ని వినూత్న కళారూపంలో నిలపాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని రూపొందించాను” అని రామకోటి రామరాజు తెలిపారు. వేల నాణాలు, గంటల తరబడి శ్రమ, అపారమైన సహనం, వీటి సమన్వయంతో రూపుదిద్దుకున్న ఈ వైఎస్సార్ చిత్రకళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# కాకునూర్‌లో అంగరంగ వైభవంగా ఈదమ్మ బోనాలు



**కేశంపేట, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఈదమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ బద్ధంగా బోనాలు ఎత్తుకొని ఈదమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడాయి.ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్ గౌడ్, గ్రామ సర్పంచ్ బుడ్డోళ్ల రాజు, వార్డు మెంబర్ సీమల శ్రీనివాస్, మంగలి కృష్ణ, కావలి నరసింహ, డిల్లీ మల్లేష్ పాల్గొని ఈదమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల జయజయధ్వానాలతో కాకునూర్ గ్రామం మార్మోగింది. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

- ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి సీఎం రేవంత్‌రెడ్డి..?
  - పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బాకీ పడి ఉంది
  - మాజీ జడ్పీటీసి పట్నం అవినాష్ రెడ్డి





**షాబాద్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందంటూ బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం షాబాద్ మండల కూడలిలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన పిలుపుతో షాబాద్ మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. దీంతో పట్టణ కూడలి గులాబీమయంగా మారింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నేతలు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, విజయ్ ఆర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి పథకాలను అమలు చేశామని నేతలు పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో వైకుంఠధామాలు, ప్రకృతివనాలు, డంపింగ్ యార్డులు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని వారు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వికలాంగులకు రూ.6,000 పింఛన్, రైతుబంధు కింద రూ.15 వేల సాయం వంటి హామీలను ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

### కేసీఆర్‌ను విమర్శించడం తప్ప మరో పని లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గత ప్రభుత్వంపై, కేసీఆర్‌పై విమర్శలు చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పలు కార్యక్రమాలను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. అప్పుల పేరుతో ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ షాబాద్ మండల కేంద్రంలో గులాబీ ఫ్లెక్సీలతో భారీగా తరలివచ్చిన కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింగరావు, చేవెళ్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జడల రాజేందర్ గౌడ్, మద్దూర్ పాండు, నర్సింలు, వివిధ గ్రామాల సర్పంచులు పాలమాకుల మల్లయ్య, నర్సింలు, దేవేందర్ రెడ్డి, రామచంద్రయ్య, రమేష్ యాదవ్, షాన్ పాషా, ముక్రమ్, ఇమ్రాన్ తదితరులతో పాటు మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గాంధీ భవన్‌కు చీరలు, గాజులు, టికిలీ బొట్లు, రబ్బర్ బ్యాండ్లు పంపిన గజ్వేల్ బీజేపీ నాయకులు

- **యూత్ కాంగ్రెస్, NSUI నాయకుల పిరికిపంద చర్యకు ప్రతీకాత్మక నిరసన: బండారు మహేష్**



**గజ్వేల్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా : గజ్వేల్ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దాడీ చేసిన వారికి ప్రతీకాత్మకంగా చీరలు, గాజులు, టికిలీ బొట్లు, రబ్బర్ బ్యాండ్లను కొరియర్ ద్వారా గాంధీ భవన్‌కు పంపించారు. ఈ సందర్భంగా గజ్వేల్ బీజేపీ నాయకుడు బండారు మహేష్ మాట్లాడుతూ, మొన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఎవరూ లేని సమయంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు కార్యాలయంపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. పార్టీ కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో, గేట్లు మూసి ఉన్న సందర్భంలో వచ్చి దాడి చేయడం రాజకీయ ధైర్యం కాదని, ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమన్నారు. ఆ సమయంలో బీజేపీ కార్యకర్తలు అక్కడ ఉండి ఉంటే వారికి తగిన విధంగా సమాధానం ఇచ్చేవారని, అయితే ఆ రోజు ఆ అవకాశం వారికి దక్కలేదన్నారు. అందుకే ఆ రోజు మిస్ అయిన ప్రతీకాత్మక సన్మానాన్ని ఈరోజు గజ్వేల్ నియోజకవర్గం బీజేపీ తరపున పూర్తి చేస్తున్నామని బండారు మహేష్ తెలిపారు. "ఎవరూ లేని సమయంలో వచ్చి పార్టీ కార్యాలయంపై దాడి చేయడంలో మీరు చూపించిన ధైర్యానికి ఇవి మా ప్రతీకాత్మక బహుమతులు. చీరలు, గాజులు, టికిలీ బొట్లు, రబ్బర్ బ్యాండ్లు స్వీకరించండి" అని ఆయన అన్నారు. ఈ వస్తువులను కొరియర్ ద్వారా గాంధీ భవన్‌కు పంపిస్తున్నామని బండారు మహేష్ తెలిపారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోవాలంటే ప్రజల మధ్యకు వచ్చి విధానాలపై పోరాడాలని, పార్టీ కార్యాలయాల్లో ఎవరూ లేని సమయంలో దాడులు చేయడం రాజకీయ పోరాటం కాదని ఆయన అన్నారు. "దాడులతో బీజేపీని భయపెట్టలేరు. ఇలాంటి ఘటనలతో బీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గరు. ప్రజా సమస్యలపై, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది" అని బండారు మహేష్ స్పష్టం చేశారు. అధికార పార్టీకి చెందిన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు ప్రతిపక్ష పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనపై ప్రభుత్వం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిలివేరు జనార్దన్ దగడ్ మధు ఆనంద సాయి గౌడు సతీష్ రెక్కీ గౌడ్ తలారి రాజు సోనీ యాదవ్ గోపాల్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# కాంగ్రెస్ వైఫల్యాలపై కదిలిన గులాబీ దండు

- **కల్వకుర్తి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యుడు గుర్క జైపాల్ యాదవ్**



**తలకొండపల్లి,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** కాంగ్రెస్ 1000 రోజుల మోసపూరిత పాలనపై రంగారెడ్డి జిల్లా అమనల్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ!బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుతో కల్వకుర్తి నియోజకవర్గంలో మిన్నంటిన నిరసన జ్వాలలు.వినూత్న నిరసన.. 420 మీటర్ల ఫ్లెక్సీ!ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మోసపూరిత హామీలను ఎండగడుతూ.. 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు. కాంగ్రెస్ మోసాలపై అమనగల్ మున్సిపాలిటీ కేంద్రంలో వెల్లువెత్తిన ప్రజాగ్రహం.ముందుండి నడిపించిన జైపాల్ యాదవ్..కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గూర్క జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ భారీ ప్రదర్శన విజయవంతంగా సాగింది.తలకొండపల్లి నుంచి భారీ మద్దతు!తలకొండపల్లి మండలం నుండి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులతో తరలివచ్చి ఈ నిరసనకు పూర్తి మద్దతు పలికారు.వెల్జాల్ నుండి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ భారీ స్థాయిలో బీఆర్ఎస్ శ్రేణులతో అడుగడుగునా తరలివచ్చిన జన సందోహంతో అమనగల్ పట్టణం మార్మోగింది.మార్మోగిన నినాదాలు: "వద్దురా నాయనా ఈ కాంగ్రెస్ పాలన!"మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజలు భారీగా నినాదాలు చేశారు. ఈ నిరసన ర్యాలీకి అమనగల్ పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ముగిసిన ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు మరియు కేసీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పినపాకలో మండల స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లపై సమావేశం

## - పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య





**పినపాక,సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** పినపాక మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై ఏడూళ్లబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు. సమావేశంలో పినపాక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. రామ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, రాములమ్మ, వరలక్ష్మి , విజయలక్ష్మి , లక్ష్మి , సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ కి 23 మంది సభ్యులు ఎన్నిక

**ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** తెలంగాణ బార్ కౌన్సిల్‌కు 23 మంది సభ్యులు ఎన్నికైనట్లు, అదనంగా ఇద్దరు మహిళా అభ్యర్థులు నామినేట్ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించారు. ఈ గెజిట్ నోటిఫికేషన్‌ను 31.08.2026న విడుదల చేసినట్లు తెలంగాణ బార్ కౌన్సిల్ వెల్లడించింది. ఈ విషయాన్ని బార్ కౌన్సిల్ కార్యదర్శి అధికారికంగా ప్రకటించారు.దీని పైన సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

# సీనియర్ పాత్రికేయుడు మహమ్మద్ ఆఫ్సర్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, మిత్రులు...



**షాద్ నగర్, సెప్టెంబర్, 02, నేటి శుభోదయ :** A6TV సీనియర్ పాత్రికేయుడు మహమ్మద్ ఆఫ్సర్ జన్మదిన వేడుకలు బుధవారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొని మహమ్మద్ ఆఫ్సర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ ఇబ్రహీం, మాజీ జడ్పీటీసీ పి. వెంకట్రాంరెడ్డి, ముఖీద్, ఆధార్ సెంటర్ శ్రీను, చింటు, కుమార్, పాషా, శిరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఆఫ్సర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, సమాజానికి ఉపయోగపడే వార్తలను ప్రజలకు చేరవేయడంలో మహమ్మద్ ఆఫ్సర్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పాత్రికేయ రంగంలో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజాసేవలో తన వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.మహమ్మద్ ఆఫ్సర్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# విద్యార్థులకి హోంవర్క్ డైరీల పంపిణీ



**నర్సంపేట, సెప్టెంబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి) :** నర్సంపేట పాకాల రోడ్డులోని జడ్.పి.హెచ్.ఎస్. మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ హోంవర్క్ డైరీలను పంపిణీ చేశారు. జడ్.పి.హెచ్.ఎస్. నెక్కొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు శ్రీమతి తోట యశోద కనిష్ఠ కుమారుడు, మహబూబాబాద్ రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ శ్రీ తోట రవీందర్ సౌజన్యంతో ఈ హోంవర్క్ డైరీలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ దామేర నర్సయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కాజంపురం దామోదర్, ఓల్డేజ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి తీరాల యుగేందర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని హోంవర్క్ డైరీలను అందించిన శ్రీ తోట రవీందర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సేవలో మరో ముందడుగు విద్యాభి వృద్ధికి అట్టేపల్లి రామప్రభు కీలక నిర్ణయం..

- **స్టాలిన్ నగర్ పాఠశాలకు వాలంటీర్ ఉపాధ్యా యురాలిగా గంగోలు భవిత నియామకం..**



**మియాపూర్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తూ అట్టేపల్లి రామప్రభు మరో కీలక కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు. స్టాలిన్ నగర్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు గంగోలు భవితను వాలంటరీ ఉపాధ్యాయురాలిగా అట్టేపల్లి రామప్రభు చైర్మన్ అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియమిం చడం జరిగింది.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబా టులో ఉండాలి. విద్య కోసం ఏ విద్యార్థి ఇబ్బంది పడకూడదు. ప్రజలకు అవసరమైన చోట అండగా నిలవడమే మా లక్ష్యం సేవ అనేది ప్రచారం కోసం కాదు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రజలకు అవసరమైన అనేక సేవా కార్య క్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉచిత అంబులెన్స్ సేవలు, అత్యవసర సమయాల్లో ప్రజలకు సహాయం, మహిళలు మరియు ప్రమాద బాధితులకు అత్యవసర రవాణా సహాయం, అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు విద్యా పరమైన సహకారం, పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు వంటి కార్యక్ర మాలను నిరంతరం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ప్రజల సమ స్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సాధ్యమైన పరిష్కా రాలు చూపిస్తూ ముందుకు సాగుతున్న అట్టేపల్లి రామప్రభు.. ప్రజాసేవే లక్ష్యంగా, విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు టి. నాగేశ్వర్, ఎస్. తిరుప తియమ్మ, ఎన్. సుష్మ లతో పాటు స్టాలిన్ నగర్ కాలనీ వాసులు మోహన్, దస్తప్పా, ప్రదీప్, సాయి గౌడ్, కోటంగారి శ్రీను, శరత్, రఘు గౌడ్, శేఖర్ ముదిరాజ్, భాగ్యమ్మ వెంకట స్వామి, నర్సింహ, శ్రీకాంత్, శివ, కమల్, వేదాంత్, సతేష్, గని, నవీన్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా ఏ ఆర్ పి టీమ్ సభ్యులు అట్టేపల్లి సోమేశ్వర్, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్, అట్టేపల్లి చరణేష్, హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఘనంగా హరితహారం కార్యక్రమం..



**శేరిలింగంపల్లి , సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్‌లోని స్టాలిన్ నగర్ మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవర ణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, చెట్లను విరివిగా పెంచడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవ చ్చని అన్నారు. “పచ్చని చెట్లు – ప్రగతికి మెట్లు” అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించా లని కోరారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థులకు చిన్ననాటి నుంచే పర్యావ రణ పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రామప్రభు పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా హరితహారం కార్యక్ర మానికి మరింత సార్థకత చేకూరుతుందని అన్నారు.ఈ కార్య క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి. నాగేశ్వర్, ఎస్. తిరు పతియమ్మ, ఎన్. సుష్మ, అలాగే స్టాలిన్ నగర్ కాలనీ వాసులు మోహన్, దస్తప్పా, ప్రదీప్, సాయి గౌడ్, కోటంగారి శ్రీను,శరత్,రఘు గౌడ్, శేఖర్ ముదిరాజ్, వెంకటస్వామి, నర్సింహ, శ్రీకాంత్, శివ, కమల్, వేదాంత్, సతేష్, గని, నవీన్ ,భాగ్యమ్మ లతో పాటు ఏ ఆర్ పి టీమ్ సభ్యులు అట్టేపల్లి సోమేశ్వర్, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్, అట్టేపల్లి చరణేష్,హరి బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# పోరాటమే లక్ష్యంగా హత్నూర జర్నలిస్టులకు డిజెఏఫ్ కీలక పదవులు

**సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం , సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :** హత్నూర, సెప్టెంబర్ 02: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్న హత్నూరకు చెందిన నలుగురు జర్నలిస్టులకు దళిత జర్నలిస్టు ఫోరంలో కీలక బాధ్యతలు లభించాయి. ముక్కగల్ల యాదన్నను జిల్లా కార్యదర్శిగా, ఎం. కిషన్‌ర ావును సలహాదారుగా, వరిగుంతం శంకర్‌ను ఆర్గనై జింగ్ సెక్రటరీగా, పరమేషుల క్రిష్ణను కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి సమక్షంలో నూతన బాధ్యతలు పొందిన జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగిం చిన కాశపోగు జాన్, తలారి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు రామని అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై దళిత జర్నలి స్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతా మని పేర్కొన్నారు.



# నర్సాపూర్: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి







**నర్సాపూర్ , సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** స ంద ర్భంగా నర్సాపూర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిం చారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకు న్నారు.ఈ కార్యక్ర మంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ కౌన్సిలర్ సుధీర్ గౌడ్ దావూద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.నర్సా పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన అంతరత క్రీడలు మరియు హౌస్ ఫార్మేషన్ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ






**నర్సాపూర్, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** నర్సాపూర్ పట్టణ బస్ స్టాండ్ అపోసిట్ మెయిన్ రోడ్డు పై 22A భూ నిశిదిత జాబితా పై మహా నిరసన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ చేవెళ్ల ఎంపీ కొండా వెంకటేశ్వరరెడ్డి గార్లు రావడం జరిగింది. వారు మాట్లాడుతూ బీజేపీ పార్టీ రైతులకు అండగా ఉంటుందని అన్నారు. 10 సంవత్సరాల BRS పార్టీ ఎప్పుడన్న కాంగ్రెస్ పార్టీ రైతులకు కష్టాలనే ఇస్తున్నారు ఏ రోజు కూడా రైతులకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ఈ 22A రైతుల భూములకు న్యాయం తప్పనిసరిగా చేయాలని బీజేపీ మెదక్ జిల్లా శాఖ తరపున డిమాండ్ చేస్తున్నాము అని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా జిల్లా అధ్యక్షులు వాలాస్ రాధా మల్లేష్ గౌడ్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఈ కార్య క్రమంలో జిల్లా పదధికారులు జిల్లా ఇంచార్జీ మండల పట్టణ అధ్యక్షులు మోర్చాల అధ్యక్షులు నాయకులు సర్పంచులు కౌన్సిలర్లు కార్యకర్తలు తదిత రులు పాల్గొనడం జరిగింది.

# ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి మణుగూరు ప్రాంత ప్రజలు తోడ్పాటు కావాలి

- **డాక్టర్ రామకృష్ణ మెడికల్ సూపర్డెంట్**






**పినపాక, సెప్టెంబర్ 02, నేటి శుభోదయ :** మణుగూరు. ఏరియా హాస్పిటల్ మణుగూరు నందు ప్రతిరోజు సుమారు 300 నుండి 500 మంది పైచిలుకు ప్రజలు వైద్య సేవల కోసం వస్తున్నారు . సుమారు ఆసుపత్రిలో ఉన్న ప్రతి బెడ్ మీద ఒక పేషంటు ఉండటం జరుగుచున్నది. ప్రస్తుతం ఉన్న వైద్య సిబ్బందిచే మంచి సర్వీస్ అందించడం జరుగుచున్నది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారం పట్టణ ప్రజల సహకారం కూడా ఈ హాస్పటల్ అభివృద్ధికి ఎంతో అవసరం ఉన్నదని భావిస్తున్నాము. బుధవారం సిద్దార్థ నర్సింగ్ కాలేజీ యాజమాన్యం ఒక ఫ్రిజ్ ని ఆస్పత్రికి విరాళం ఇవ్వడం జరిగినది. భద్రాచలంలోని రామకృష్ణ ఆసుపత్రి యాజమాన్యం కొంత ఫర్నిచర్ ఇవ్వడం కూడా జరిగినది. మణుగూరు సబ్ డివిజన్ లో న్యూజిలాండ్ ఆస్ట్రేలియా సేవా దృక్పథం కలిగిన కొంతమంది ఆసుపత్రికి మీ చేతనైన సహాయం చేస్తారని ఆశిస్తున్నాం

# శంషాబాద్ ఓఆర్ఆర్‌పై భారీ ప్రమాదం

- **అదుపుతప్పి 12 అడుగుల ఎత్తు నుంచి సర్వీస్ రోడ్డుపై పడిన లారీ**



**శంషాబాద్, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓ ఆ ర్ఆ ర్) పై రాళ్ల గూడ స మీప ంలో బుధవారం భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిమెంట్ బస్తాలతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఓఆర్ఆర్ నుంచి సుమారు 12 అడుగుల ఎత్తు నుంచి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం.. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం కూడా ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అదుపుతప్పిన లారీ రోడ్డు పక్కన ఉన్న ప్రాంతాన్ని దాటి సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్, క్లీనర్‌ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ప్రమాదం కారణంగా ఓఆర్ఆర్‌పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు లారీని రహదారి నుంచి తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ప్రమాదానికి అసలు కారణం ఏమిటనే దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై నిరసన

- **వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని నిరన:కార్తీక్ రెడ్డి**






**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 2 , నేటి శుభోదయ :** శంషాబాద్ జిహెచ్ఎంసి కొత్వాల్ గూడ డివిజన్ 119లొ భారీ నిరసన కార్యక్రమం,మహా ధర్నా నిర్వహించడం జరిగింది.కార్యక్రమానికి మన రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డిముఖ్య అతిగా రావడం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన తీరును ఎండగడుతూ ఈ నిరసన కార్యక్రమానికి 118 డివిజన్, 119 డివిజన్, శంషాబాద్ మండల, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి స్ఫూర్తి

- **జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజషన్ సెక్రటరీ బోడ రమేష్**
- **పేదల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతకు ఘన నివాళులు**



**పినపాక, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఏడూళ్ల బయ్యారం ఎక్స్ రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బోడ రమేష్ మాట్లాడుతూ.. “పేదవాడి కన్నీటిని తుడవడమే నిజమైన ప్రజా సేవ.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి అసలైన బాధ్యత” అనే ఆలోచనతో పరిపాలన సాగించిన మహానేత వైఎస్సార్ అని అన్నారు.రైతుల కోసం ఉచిత విద్యుత్, పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, అత్యవసర వైద్య సేవలకు 108, 104 వంటి అనేక చారిత్రాత్మక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి కోట్లాది కుటుంబాలకు వైఎస్సార్ భరోసాగా నిలిచారని గుర్తుచేశారు.“వైఎస్సార్ ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు.. పేదల గుండెల్లో స్థానం సంపాదించిన మహానేత. ఆయన పాలనలో సంక్షేమం ఒక పథకం కాదు.. ప్రతి పేద కుటుంబానికి ఒక భరోసా” అని బోడ రమేష్ అన్నారు.వైఎస్సార్ ప్రజల మధ్య నడిచిన నాయకుడని, పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి పరిష్కారాలు చూపిన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన ప్రజా సేవా మార్గం, పేదల పట్ల ఆయనకున్న నిబద్ధత, రైతులు–విద్యార్థులు–మహిళలు–బలహీన వర్గాల సంక్షేమంపై ఆయనకు ఉన్న దృక్పథం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమన్నారు.“వైఎస్సార్ ఆశయాలు చిరస్థాయిగా నిలవాలంటే ప్రజల కోసం పనిచేయాలి. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలి. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేయాలి. అదే మహానేత వైఎస్సార్‌కు మనం అందించే నిజమైన నివాళి” అని బోడ రమేష్ పేర్కొన్నారు.వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచి, ప్రజల కోసం పనిచేసే రాజకీయమే వైఎస్సార్‌కు నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొంబత్తిని శ్రీనివాసరావు, మండల మైనార్టీ అధ్యక్షులు ఎస్.కె. మదర్ సాహెబ్, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు యాలం బుజ్జిబాబు, జక్క వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహానేత డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి కి ఘనంగా నివాళులర్పించారు.

# షాద్ నగర్ లో ఘనంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

- **ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు, బ్రెడ్ లు పంపిణీ చేసిన జనసేన నాయకులు జరుపుల రాజు నాయక్**
- **పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు అభిమానులకు పండగ రోజు**
- **రాబోయే రోజుల్లో షాద్ నగర్ లో జనసేన పార్టీనీ బలోపేతం చేస్తాం**
- **షాద్ నగర్ నియోజకవర్గం జనసేన ఇన్చార్జి నాయకులు జరుపుల రాజు నాయక్**





**షాద్ నగర్,సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :** ఘనంగా షాద్ నగర్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించడం జరిగిందని షాద్ నగర్ నియోజకవర్గం జనసేన ఇన్చార్జి నాయకులు జరుపుల రాజు నాయక్ తెలిపారు.బుధవారం జనసేన పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లా సీనియర్ నాయకులు జరుపుల రాజు నాయక్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఏర్పాటు చేసి షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు,బ్రెడ్ పంపిణీ చేసారు.ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ..అందరి అభిమాన నాయకుడు జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ఒక పండుగ వేడుకగా తెలుగు రాష్ట్రాల అభిమానులతో పాటు ఇతర రాష్ట్రాల అభిమానులు కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు.పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు ఒక కొత్త వ్యూహంతో భారతదేశంలో గర్వించేలా తన గెలుపుతో చాటి చెప్పారని,అభిమానులకు జనసేన నాయకులకు ఏ ఆపద వచ్చినప్పుడు వెంటనే స్పందించి అభిమానులకు అండగా ఉన్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు.ఆయన నడిచే మార్గం సేవా భావం,సేవ గుణం అదే మెగా అభిమానులం,జనసేన నాయకులు ఆయన అడుగుజాడలో నడుస్తూ ఆయన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం,వివిధ సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన పుట్టినరోజు అభిమానులందరికీ పండగ వాతావరణం అని ఆరు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం డి అషారప్,పవన్,శ్రీశైలం,అరవింద్,నాని,శివ జానీ,మహేష్,రామకృష్ణ,జగన్ ,నరసింహ తదితరులు పాల్గొన్నారు.






Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620